ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 25.0



నవ శకం

బదిలీలతో శాఖల్లో సమూల ప్రక్షాళన

కొంతలో కొంత పాత వాసనలు తొలగాయి. ఏకపక్షంగా వ్యవహరించిన మరికొందరికి స్థానచలనం తప్పలేదు. పనిలో పనిగా ప్రభుత్వ నియమ నిబంధనలను సరించి 14 శాఖల్లో సిబ్బంది అధికారులను ఎక్కడికక్కడ బదిలీలు చేశారు. ఇప్పటికే పాతుకుపోయ్ని పలువురిని వదిలించు కోవడమే కాకుండా పనిచేసే సామర్థ్యం వున్న ఇంకొందరిని దారికి తెచ్చారు. పదే పదే వివాదాలు సృష్టిస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న వారిని పక్కకు నెట్టేశారు. జిల్లా వ్యాప్తంగా బదిలీల ప్రక్రియ సోమవారంతో ఒక కొలిక్కి వచ్చింది. తిరిగి బదిలీల నిషేధం అమల్లోకి వచ్చింది.

ముగిసిన బదిలీల ప్రక్రియ

- పాత వాసనలు తొలగించేందుకే అత్యధిక ప్రాధాన్యత
- కీలక శాఖలన్నింటిలోనూ కన్పిస్తున్న కొత్తదనం
- మరింత దూకుడు పెంచేందుకు కూటమికి కలిసొచ్చిన అవకాశం
- విధ్వంసం స్థానంలో.. నూతన ఉత్తేజం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ప్రత్యేకించి ఎవరైతే రాజకీయపరమైన రంగేసుకుని ఇన్నాళ్లు ఇష్టానురీతిలో వ్యవహరించారో వారంతా వున్న స్థానాల నుంచి కదిలిపోయారు. ఐదేళ్ల పాటు రాష్ట్రంలో ఏక పక్ష, నియంతృత్వ పోకడలకు అనుగుణంగా అప్పటి ప్రభుత్వం ఏరకంగా వ్యవహరించిందో వాటన్నింటికి తానా తందానా అంటూ వంతపాడి ఐదేళ్ల పాటు ఒకే స్థానంలో ఏక పక్షంగా వ్యవహరించిన వారిని బదిలీల రూపంలో సర్దుబాటు చేశారు. ప్రభుత్వం ముందుగా నిర్దేశించినట్లుగా సోమవారంతో దాదాపు వందలాది మంది ఉద్యోగులు, అధికారులు బదిలీ అయ్యారు. దీర్ఘకాలంగా ఒకేస్థానంలో సెటిలై తమ అవసరాల కోసం ఎవరైతే ఎదుటివారిని ఇబ్బంది పెట్టారో వారందరిని గుర్తించి మరీ పనిలో పనిగా వేరే స్థానానికి మార్చారు. అత్యంత కీలకమైన శాఖల్లో పనిచేస్తున్నవారిలో ఎక్కువ మంది బదిలీ అయ్యారు. వీరిలో కొంతమంది రిక్వెస్ట్ బదిలీపై వెళ్లగా రాజకీయ ప్రేరేపిత వ్యవహారాల్లో ఆరితేరిన మరికొందరిని సాగనంపేశారు. ప్రత్యేకించి ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తూ ఐదేళ్లపాటు ఒకే స్థానంలో పనిచేసిన వారందరిని అటు ఇటు మార్చారు. గడచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఏ మాత్రం పనిచేయకపోగా ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న వారికి అదే చెప్పారు. ఎక్కువ మంది సామర్థ్యం వున్న వారెవ్వరికి చేతినిండా పనిలేని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిని సృష్టించిన వారందరికి కూటమి ప్రభుత్వ వచ్చిన తర్వాత చేతినిండా పని కల్పించే విధంగా ఈ మధ్యనే అనేక పనులకు టెండర్లు దాదాపు ఖరారయ్యాయి. ఈ క్రమంలో తాము కోరుకున్న ప్రాంతాలకు వెళ్లేందుకు సీనియర్ ఇంజనీర్లంతా ప్రయత్నించారు. వీరిలో కొందరికి ఎమ్మెల్యేలు సిఫార్సు లేఖలు కూడా ఇచ్చి మరీ కోరుకున్న స్థానాలకు బదిలీ జరిగేలా చూశారు. పంచాయతీరాజ్ విభాగంలో ఇన్నాళ్ల పాతుకుపోయిన మరికొంతమంది బదిలీ అయ్యారు. అన్నిటికంటే మించి పంచాయతీరాజ్‌లోనూ అత్యంత కీలకమైన తాగునీటి సరఫరా విభాగంలోనూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు కీలకంగా మారాయి. ఇలాంటి దశ లోనే సమర్థులైన ఇంజనీర్లు, అధికారులను ఇతర ప్రాంతా లకు బదిలీ అయ్యేలా కొందరు ప్రజాప్రతినిధులు పోటీలు పడ్డారు. ఇంకొందరు ఉద్యోగులైతే తాము ఏదైతే కోరుకున్నారో అదే స్థానానికి వెళ్లేలా పట్టుబట్టి మరీ మధ్యవర్తుల చేయి తడిపి సాధించుకున్నారు. పంచాయతీరాజ్‌కు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వం వహిస్తుండటంతో బదిలీల ప్రక్రియ మొదటి నుంచి చివరివరకు అన్ని నియోజకవర్గాల్లోనూ అచి తూచి వ్యవహరించారు. ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే శాఖల్లో ఒకటైన రిజిస్ట్రేషన్ శాఖలోనూ బదిలీల ప్రక్రి య ఎలాంటి గందరగోళం లేకుండానే సాఫీగా ముగిశాయి. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ నుంచి అనేకమంది సబ్ రిజి స్ట్రార్‌ల వరకూ మార్చారు. ఈ ప్రక్రియలో కొందరు సామాజికపరమైన కోణాన్ని ఎంచుకున్నారు. ఉభయ గోదావరి జిల్లా ల్లోనూ ఈ బదిలీల ప్రక్రియ ఆసాంతం ప్రశాంతంగా ముగించడానికి జాగ్రత్త పడ్డారు. రవాణా శాఖలోనూ బదిలీలు వ్యవహారమంతా సాఫీగానే సాగింది. విద్యుత్తు, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్ వంటి శాఖల పరిధిలోనూ బదిలీల సంఖ్య స్వలం గానే వున్నా ఇదంతా సాఫీగా సాగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. చివరకు ఆబ్కారీ శాఖకు తిరిగి జీవం పోస్తూ అనేకమందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. సెబ్ విడిపోయిన తర్వాత ఎక్సైజ్ శాఖకు కాళ్లొచ్చాయి. ప్రభుత్వ మద్యం విధానం మళ్లీ మారడంతో ఆ మేరకు ఎక్సైజ్‌శాఖలో బదిలీలు పోస్టింగ్‌లు అన్నీ శరవేగంగా పూర్తి చేశారు. అత్యంత కీలకమైన ఈ శాఖ పరిధిలోనే అక్టోబరు నుంచి పెద్దఎత్తున మద్యం విక్రమాలు సాగనుండడం అదే క్రమంలో భారీగా ప్రభుత్వానికి జిల్లాల వారీగా ఆదాయం సమకూరుతుండడంతో ఎక్సైజ్‌పై అందరూ దృష్టి పెట్టి మరీ బదిలీ వ్యవహారం పూర్తి అయ్యేలా జాగ్రత్త పడ్డారు.





ఐదేళ్ల జగన్ పాలనలో అన్ని శాఖలు నిర్వీర్యం కావడమే కాకుండా దాదాపు విచ్ఛిన్నమయ్యాయి. ఈ పరిస్థితి నుంచి అన్ని శాఖలను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం తొలి వందరోజుల్లోనే మార్పులు, చేర్పులు చేస్తూ వచ్చింది. గత ప్రభుత్వంలోనే వైసీపీ రాజకీయ వాసనలకు అలవాటు పడిన కొన్ని శాఖలు అధికారులు సిబ్బందిని బదిలీల పేరిట దాదాపు స్థానచలనం చేయగలిగారు. దీంతో ఆయా శాఖల్లో వున్న పరిస్థితులన్నీ ఇప్పుడు ఒక గాటన పడబోతున్నాయి. వాస్తవానికి మద్యం వ్యాపారం ప్రభుత్వమే చేయడంతో అప్పట్లో ఎక్సైజ్ అధికారులకు చేతినిండా పనిలేకుండా పోయింది. ఇప్పుడా శాఖకు జీవం పోయడం, బదిలీల ద్వారా పాత పద్ధతిలోనే బలీయమైన శాఖగా మార్చడంతో కొత్త రూపురేఖలు కన్పిస్తున్నాయి. జలజీవన్ మిషన్ అమలు చేయడానికి వీలుగా ఆయా శాఖల వారీగా వున్న వారిని మార్పు చేర్పు చేయడం ద్వారా ఇప్పుడు ఆ శాఖలన్నింటిలోనూ కొత్తదనం తెచ్చారు. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో తాజాగా సంస్కరణలు తేవడమే కాకుండా సమాంతరంగా అధికారులు సిబ్బంది పెద్దఎత్తున మార్పులు చేర్పులు చేయడం ద్వారా తమ సంస్కరణలకు అనుగుణంగా ప్రభుత్వం వ్యవహరించినట్లయింది. ఇప్పటికే పేదలకు పింఛన్లు ఇవ్వడంలో కానీ జగనన్న సర్వే పేరిట

విచ్ఛిన్నం నుంచి బంగారు బాటలో..

వ్యవసాయ భూముల్లో వివాదాల ఒడిదుడులను పూర్తిగా సవరించగలిగారు. ఫలితంగా పెద్దఎత్తున రైతువారీ కుటుంబాలకు మద్దతును కూటమి ప్రభుత్వం కూడగట్టుకోగలిగింది. ఇప్పటి దాకా ప్రభుత్వ శాఖల్లో వున్న నిర్వీర్యాన్ని బదిలీల రూపంలో కొంత తొలగించగలిగారు. ఇదే సమయంలో ప్రత్యేకించి ప్రజామద్దతుతో తాము గెలిచాం కాబట్టి ఆ మేరకు ప్రజలకు మేలు చేయాలనే కాంక్షతో మరికొంత మేర ముందుకు కదిలేటట్లు అయింది. వందరోజుల పాలనలో ఎలాగూ విజయాలు సాధించ గలిగిన ఇప్పుడు క్షేత్రస్థాయిలో ప్రజలతో టచ్‌లో వుండే శాఖలన్నింటిలోనూ సమూలంగా మార్పులు చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం సక్సెస్ అయింది. బదిలీల ప్రక్రియలో కొంత చేతులు మారినట్లు అపవాదుల నుంచి మాత్రం తప్పించుకోలేకపోయారు.

చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్‌గా పావని బాధ్యతల స్వీకరణ



చింతలపూడి, సెప్టెంబరు 30 : చింతలపూడి నగర పంచాయతీ మునిసిపల్ కమిషనర్‌గా డి.పావని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రాజమండ్రి కార్పొరేషన్‌లో ఏవోగా పని చేస్తూ కమిషనర్‌గా బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో సమస్యల పరిష్కారానికి తన సహకారం అందిస్తానని, ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. చింతలపూడి నగర పంచాయతీ ఏర్పడిన మూడున్నరేళ్లలో ఆరో కమిషనర్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించారు. గత సార్వత్రిక ఎన్నికలకు కొద్దిరోజుల ముందు ఇక్కడకు కమిషనర్‌గా వచ్చిన ప్రసాదరాజు ఎన్నికల అనంతరం అనకాపల్లి జిల్లా యలమంచిలికి బదిలీపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి కమిషనర్ పోస్టు ఖాళీగా ఉంది.

ఏలూరు ఆర్డీవోగా అచ్యుత అంబరీష్..


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నూతన ఆర్డీవో

ఏలూరు రూరల్, సెప్టెంబరు 30 : ఏలూరు డివిజన్ ఆర్డీవోగా నియమితులైన ఎం.అచ్యుత అంబరీష్ సోమవారం ఏలూరు ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో పుష్పమణిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కలను అందజేశారు.

తగ్గుతున్న గోదావరి

పోలవరం, సెప్టెంబరు 30 : అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నాలుగు రోజులుగా పెరిగిన గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రానికి క్రమక్రమంగా తగ్గుతూ వస్తోంది. ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 2,95,859 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్టు ఈఈ వెంకటరమణ తెలిపారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 28.770 మీటర్లు, స్పిల్‌వే దిగువన 18.980 మీటర్లు నమోదైనట్టు ఈఈ మల్లిఖార్జునరావు తెలిపారు. ఎల్‌ఎన్‌డీపేట కొవ్వాడ రిజర్వాయర్‌లో నీటిమట్టం 90.05 మీటర్లు నమోదు కాగా 150 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్టు సిబ్బంది తెలిపారు.

అబ్బురపరిచిన అంతరిక్ష ప్రదర్శనలు

7

ఏలూరులో 'ఇస్రో' స్పేస్ ఆన్ వీల్స్

నేడే పింఛన్ల పండుగ

- ఉదయం 6 గంటలకే పంపిణీ ప్రారంభం
- జిల్లాలో 2.64 లక్షల లబ్ధిదారులకు రూ.113.24 కోట్లు
- తొలిరోజే నూరు శాతం అందించేందుకు ఏర్పాట్లు



ఏలూరు సిటీ, సెప్టెంబరు 30 : గతనెలలో మాదిరిగానే అక్టోబరు నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను ఇంటింటికీ పంపిణీ చేయడానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. తొలి రోజునే నూరుశాతం పంపిణీ సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం 6గంటలకే ఈ పింఛన్‌ల పండుగ ప్రారంభమవుతుంది. జిల్లాలో 2లక్షల 64వేల 966 మంది లబ్ధిదారులకు 113 కోట్ల 24 లక్షల 40 వేల 500 రూపాయలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. పింఛన్ల పంపిణీపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సమీక్షించారు. ఉదయం ఆరు గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించి పెన్షన్‌దారులందరికీ మొదటి నాలుగు గంటలలోపే పంపిణీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా పొరపాటు జరగకుండా పంపిణీ జరగాలని సూచించారు. గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది పెన్షన్‌దారుల ఇళ్లకు వెళ్ళి పింఛన్‌లను అందజేస్తారు. తొలిరోజునే నూరుశాతం పింఛన్‌లు పంపిణీ చేయడానికి 5,174 మంది సచివాలయ , ఇతర ప్రభుత్వ సిబ్బందిని నియమించారు. అనివార్య కారణాలతో పింఛన్ తీసుకోనివారికి అక్టోబరు 2వ తేదీన గాంధీ జయంతి సెలవు కాబట్టి తిరిగి అక్టోబరు 3వ తేదీన పింఛన్ అందిస్తారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు, ఎల్‌డీఎం డి.నీలాద్రి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పింఛన్‌ల వివరాలు..

పింఛన్ రకం	లబ్ధిదారులు	పింఛన్ మొత్తం
అభయహస్తం	4,719	2,39,500
అమరావతి	10	50,000
లాండ్‌లెస్‌పూర్		
డప్పుకళాకారులు	2,069	82,76,000
విభిన్నప్రతిభావంతులు	33,604	20,16,24,000
మత్స్యకారులు	6,268	2,50,72,000
కళాకారుల పెన్షన్	169	6,76,000
వృద్ధాప్య	1,31,826	52,73,04,000
సైనిక్‌వెల్ఫేర్	18	90,000
సింగిల్ ఉమెన్	8,312	3,32,48,000
తలసేమియా	74	7,40,000
కల్లుగీత కార్మికులు	4,578	1,83,12,000
చర్మకారులు	1,691	67,64,000
ట్రాన్స్‌జెండర్	74	2,96,000
నేత కార్మికులు	1,141	45,64,000
వితంతు	67,934	27,17,36,000
సీకేడీయూ (ప్రభుత్వ)	198	19,80,000
సికెడీయు(ప్రైవేటు)	346	34,60,000
డీఎంహెచ్‌వో	1,935	2,54,09,000
మొత్తం	2,64,966	1,13,24,40,500



మింగుడు పడని.. ముద్ద!

- భారీగా పెరిగిన బియ్యం ధరలు
- బస్తాకు రూ.200కు పైగా పెరుగుదల
- కొనలేమంటూ సామాన్యుల బెంబేలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 30 : సామాన్యులపై మరో పిడుగు పడింది. ఇప్పటికే నిత్యావసరాలు, వంట నూనె, పప్పుల ధరలు పెరగడంతో ఉక్కిరిబిక్కిరి అవుతుండగా బియ్యం ధరలు షాక్ ఇస్తున్నాయి. ప్రస్తుతం సోనా మసూరి, హెచ్‌ఎంటీ, బి.పి.టి తదితర సన్నబియ్యం రకాల ధర కిలో రూ.60 నుంచి రూ.70 ఉంది. బియ్యం రేట్లు భారీగా పెరిగాయి. ప్రస్తుతం రాష్ట్రంలో, దేశంలో వరి సాగు తగ్గడంతో పాటు బాస్మతి యేతర బియ్యం ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేయడం కూడా ఒక కారణంగా తెలుస్తోంది. పారా బాయిల్డ్ బ్రౌన్‌రైస్‌పై ఎగుమతి సుంకాన్ని 20 నుంచి 10 శాతానికి తగ్గించడం ప్రభావం చూపనుంది. ప్రస్తుతం ఏ వస్తువు పట్టుకున్నా షాక్ కొట్టేలా ఉన్నాయి. పిల్లల చదువులు, ఇంట్లో నిత్యావసర సరుకులు, ఇంటి కిరాయిలు, ఇతర ఖర్చులకు అరకొరగా సంపాదించే సామాన్యుడి జీతం నెల తిరిగే సరికే ఆవిరైపోతోంది. ఇక దినసరి కూలీ సంగతి సరేసరి. దీనికితోడు మునుపెన్నడూ లేని రీతిలో బియ్యం ధరలు అమాంతంగా పెరగడంతో బియ్యం కొనుగోలు చేయాలంటేనే సామాన్యులు హడలిపోతున్నారు. సన్న బియ్యం కొనేవారు ప్రస్తుతం ధరలు పెరగడంతో ఏం చేయాలో పాలుపోక రేషన్ బియ్యాన్నే తింటామంటూ నిట్టూరుస్తున్నారు. ధరలు పెరగడంతో నెలవారీ ఖర్చులు భారీగా పెరిగాయంటున్నారు. ప్రభుత్వం పెరిగిన ధరలను తగ్గించే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ధరల పెరుగుదల ఇలా..

ప్రస్తుతం సోనామసూరి 25 కేజీల బస్తా నెంబరు వన్ రకం గత రెండునెలల క్రితం రూ.1250 ఉండగా, ఇప్పుడు రూ.1430కి చేరుకుంది. గత నెల కర్నూల్ సోనా 26 కేజీల బస్తా రూ.1130 ఉండగా, అది ఇప్పుడు రూ.1300లకు చేరింది. ఇలా బస్తాకు రూ.200కు పైగా పెరగడంతో ప్రస్తుతం సామాన్యులు దొడ్డు రకాలే కొనుగోలు చేస్తున్నారు. గతంలో హెచ్‌ఎంటీ , సోనామసూరి రకాలు కొనేవారని, ఇప్పుడు దొడ్డురకాలు ఎక్కువగా అమ్మకాలు సాగుతున్నాయని వ్యాపారులు అంటున్నారు. పలు రాష్ట్రాల్లో భారీవర్షాలతో పంటలు దెబ్బతినడం, సన్నాలు సాగు తగ్గడంతోనే బియ్యం రేట్లు పెరిగాయంటున్నారు. అక్టోబరులో పంట చేతికి వస్తే కాస్త రేట్లు తగ్గే అవకాశం ఉంటుందని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో బి.పి.టి ధాన్యానికి డిమాండ్ పెరిగింది.



ధరలు చూసి గుండె గుభేలుమంటోంది..



మార్కెట్లో బియ్యం ధర చూస్తే గుండె గుభేలు మంటోంది. నెలరోజుల వ్యవధిలోనే అమాంతం పెరిగాయి. ఎప్పుడూలేని విధంగా అన్‌సీజన్‌లోనూ బియ్యం ధరలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. మేలో బి.పి.టి కేజీ రూ.45, హెచ్‌ఎంటీ రూ.54కి విక్రయించేవారు. ఇప్పుడు రూ.70ల నుంచి రూ.80లకు విక్రయిస్తున్నారు. ధరల పెరుగుదల వల్ల మాపై మోయలేని భారం పడుతుంది.

– జి.పద్మజ - ఏలూరు

మోయలేని భారం



ఆకాశాన్ని అంటుతున్న ధరల వల్ల మోయలేని భారం పడుతోంది. చిన్న కుటుంబాలు నాణ్యత బియ్యం కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. నిత్యావసర వస్తువులు, ఆయిల్ ధరలు భారీగా పెరిగాయి. ఇప్పుడు బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయి. ఇదే అదునుగా వ్యాపారులు మరింత పెంచేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ధరలను ప్రభుత్వం నియంత్రించాలి.

– రాజ్యలక్ష్మి, దుగ్గిరాల

అర్జీలు పునరావృతం కావొద్దు

కలెక్టర్ వెట్రిసెల్వి .. వినతుల స్వీకరణ

ఏలూరు రూరల్, సెప్టెంబరు 30 : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వచ్చిన అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం పీజీ ఆర్ఎస్ కార్యక్రమంలో జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో పుష్పమణి, ఆర్డీవో ఖాజావలీ, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భాస్కరరావు తదితరులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని, నిర్దిత కాల వ్యవధిలో నాణ్యమైన పరి ష్కారం చూపాలన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా అధికారులు గ్రీవెన్స్‌కు తప్పక హాజరు కావాలని స్పష్టం చేశారు. వేదిక వద్దకు వెళ్లలేని వృద్ధులు, దివ్యాంగులను కిందనే ప్రత్యేకంగా వీల్‌చైర్‌లో కూర్చోబెట్టి వారివద్దకే వెళ్లి కలెక్టర్ వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏజెన్సీలో భూ సమస్యలను పరిష్కరించండి

గిరిజన దర్బార్‌లో గిరిజనుల వినతి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 30 : ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కారించాలని, ఇరుపక్షాల సమక్షంలో భూ రికార్డులను పరిశీలన చేయాలని, పీసా గ్రామసభల షెడ్యూల్‌ను వెంటనే విడుల చేయాలని కోరుతూ సోమవారం కేఆర్ పురం ఐటీడీఏలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు ఏపీవో వీఎస్ నాయుడికు వినతిపత్రం అందజేశారు. సంఘం మండల నాయకులు కారం భాస్కర్, పోలోజు నాగేశ్వరావు మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రభుత్వ, ఏడబ్ల్యుడి, పోరంబోకు భూములు స్థానిక గిరిజనులకే చెందుతాయన్నారు. ఇనుమూరులోని సుమారు 80 ఎకరాల ఏడబ్ల్యుడీ భూమిని దొరమామిడికి చెందిన గిరిజనేతరులకు వారసత్వ భూమిగా చూపుతున్నారని, 1994 వరకు ఏడబ్ల్యుడీ భూమి ఉండగా వారసత్వంగా ఎలా చూపుతారని ప్రశ్నించారు. పీసా గ్రామ కమిటీల ఏర్పాటుకు షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కారం ముత్యాలరావు, కె.లక్ష్మడు, పి.అక్కమ్మ, టి.మంగతాయారు, బి.తేజ, టి.ముత్యాలమ్మ, కె.సీత, కె.వసంత తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలో గ్రామ సంఘాల్లో పనిచేస్తున్న వీవోఏలకు పెండింగ్ గౌరవ వేతనాలు ఇప్పించాలని కోరుతూ గిరిజన దర్బార్‌లో అధికారులకు వీవోఏలు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం 10 వేలు ఇస్తామని చెప్పి 8 వేలు మాత్రమే ఇచ్చిందని, నెలకు 26 వేలు గౌరవ వేతనం కల్పించాలని కోరారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.


భూసమస్యలపై ఫిర్యాదు చేస్తున్న గిరిజనులు

వడ్డీల పేరిట వేధిస్తే చట్టరీత్యా చర్యలు : ఎస్పీ

ఏలూరు క్రైం, సెప్టెంబరు 30 : జిల్లాలో ఎవరైనా అధిక వడ్డీలతో పేరుతో అక్రమాలకు పాల్పడితే వారిపై చట్టారీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో 54 ఫిర్యాదులను స్వీకరించారు. వాటి పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు తమ కుటుంబ అవసరాల నిమిత్తం ఇతరుల వద్ద నుంచి డబ్బులు తీసుకునే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ముంబై, ఢిల్లీ, కోల్‌కత్తా, చెన్నై నుంచి సీబీఐ అధికారులమంటూ, పోలీసు అధికారులమంటూ ఫోన్లు చేసి మీరు మత్తు పదార్థాలు సరఫరా చేశారనో, డబ్బులు హవాలా రూపంలో మార్పులు చేశారని దానిపై కేసులు నమోదు చేశామని బెదిరింపు కాల్స్ చేస్తున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అలాంటి ఫోన్లు వస్తే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు గాని సైబర్ సెల్ 1930కి సమాచారం అందించాలన్నారు. కాగా ఫిర్యాదుదారులకు శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి ఏర్పాటు చేయగా ఎస్పీ భోజన వడ్డన చేశారు.

కాల్‌మనీ బాధితులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్/ఏలూరు క్రైం, సెప్టెంబరు 30: కాల్‌మనీ బాధితులను అన్నివిధాల ఆదుకుని అండగా ఉంటామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. కాల్‌మనీ బాధితులతో కలిసి ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్‌కు అన్ని ఆధారాలను అందించి సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవా లని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాల్‌మనీ బాధితులు ఎవరూ డబ్బులు కట్టాల్సిన అవసరం లేదన్నారు. ఏలూరులో కలకలం సృష్టించిన కాల్‌మనీ వ్యవహారంపై దృష్టి సారించామని, బాధితులకు న్యాయం చేసే ఆలోచన చేస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులను అడ్డుపెట్టుకుని వడ్డీ వ్యాపారులు రెచ్చిపోయారన్నారు. కొంత మంది పేదలపై కోర్టుల్లో కేసులు వేశారని, టీడీపీ లీగల్ సెల్ ద్వారా బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఏలూరులో అధిక వడ్డీల పేరుతో వేధించే వారిని ఉక్కుపాదంతో అణచివేయాలని ఎస్పీకి సూచించినట్టు తెలిపారు. మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, అమరావతి అశోక్, టీడీపీ నాయకులు ఉన్నారు. తొలుత బాధితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎస్పీ కార్యాలయం ముందు నిరసన తెలిపారు.


కాల్‌మనీ బాధితుల తరపున ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి


కొబ్బరి రైతుల సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ శ్రీనివాస్

కొబ్బరి రైతులను ఆదుకోండి

ద్వారకాతిరుమలలో ఏపీ రైతుల సంఘ రాష్ట్ర సమావేశం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 30: రాష్ట్రంలోని కొబ్బరి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏపీ కొబ్బరి రైతుల సంఘ రాష్ట్ర సమావేశం డిమాండ్ చేసింది. ద్వారకాతిరుమలలో కొబ్బరి రైతుల సంఘ సమావేశం రాష్ట్ర కోకన్వీనర్ బత్తిన లక్ష్మీనారాయణ అధ్యక్షతన సోమవారం జరిగింది. కొబ్బరి రైతుల సమస్యలను చర్చించి కార్యాచరణ రూపొందించారు. సంఘ కన్వీనర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెగుళ్ల సోకి కొబ్బరి దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతున్నారన్నారు. విదేశీ దిగుమతుల వల్ల కనీస ధర కూడా రావడం లేదని ఆవేదన చెందారు. వ్యాపారులు రైతుల నుంచి కాయలను కొనుగోలు చేసిన తర్వాత ధర పెంచుతున్నారని ఈ ధర అంతా రైతులకు వస్తున్నట్లు చెప్పడం తగదన్నారు. కొబ్బరి బోర్డు ద్వారా రైతులకు కొబ్బరి మొక్కలు, ఎరువులు, యాంత్రీకరణ పరికరాలు సబ్సిడీపై అందజేయాలన్నారు. జిల్లాలో కొబ్బరి రైతుల సమస్యలపై అక్టోబరులో సదస్సులు జరిపి అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలివ్వాలని సమావేశం నిర్ణయించిందన్నారు.

నేటి నుంచి గాంధీ జయంతి కార్యక్రమాలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 30 : మహాత్మాగాంధీ జయంతి పురస్కరించుకుని అక్టోబరు 1, 2 తేదీల్లో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు సర్వోదయ మండలి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటో తేదీన భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద అహింస ప్రతిజ్ఞ, ర్యాలీ, గాంధేయంపై సదస్సు, 2న ఉదయం 10 గంటలకు పెదనింద్ర కొలనులోని మహాత్మాగాంధీ భవనంలో సర్వమత ప్రార్థనలు, గాంధేయవాదులకు పురస్కారాలు, మధ్యాహ్నం 2 గంటలకు చాగల్లు మండలం మల్లవరం గాంధీ స్మారక కేంద్రంలో దాతలకు పురస్కారాలు, విద్యార్థులకు గాంధీ స్ఫూర్తి అవార్డులు, స్వచ్ఛభారత్ ర్యాలీ, శాంతి ప్రదర్శలను జరుగుతాయని వివరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తిమ్మాపురం విద్యార్థినులు



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 30: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గణపవరంలో నిర్వ హించిన సాఫ్ట్ టెన్నిస్ అండర్-17 బాలికల విభాగంలో ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురం హైస్కూల్ విద్యార్థినులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. 9వ తరగతి విద్యార్థినులు పి.దివ్య శ్రీగిరి రాధికలు నవంబరులో కడపలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఉపాధ్యాయులు తెలిపారు.

రగ్బీ పోటీలకు అఖిల్ శ్రీవర్మ



గణపవరం, సెప్టెంబరు 30: నర్సాపురంలో జరిగిన క్రీడా పోటీలలో గణపవరం విద్యార్థి అఖిల్ శ్రీవర్మ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సోమవారం నర్సాపురంలోని ఎల్‌బీ చర్ల ప్రభుత్వ పాఠశాలలో జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు జరిగాయి. గణపవరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి ఎం.అఖిల్ శ్రీవర్మ కడపలో జరిగే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యాడు. హెచ్‌ఎం మూర్తి, పీడీ పద్మావతి అభినందించారు.

ఇక ఏఎన్‌ఎంలకు ఆరోగ్య ఉప కేంద్రాల్లో విధులు

ఉమ్మడి జిల్లాలో 633 సబ్‌సెంటర్లు పునఃప్రారంభం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 30 : గ్రామీణ ఆరోగ్య సేవల్లో పలు సంస్కరణలను ప్రవేశపెడుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం ఇప్పటివరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్‌ఎంలు మంగళవారం నుంచే సంబంధిత పీహెచ్‌సీకి అనుబంధంగా వుండే ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అలాగే ఏఎన్‌ఎంలు తమకు కేటాయించిన డ్యూటీ చార్టుకి భిన్నంగా పంచాయతీ విధులు, శానిటేషన్ పనుల పర్యవేక్షణ, ఇంటి పన్నుల వసూళ్ళ వంటివి చేయరాదని, ఆరోగ్య సేవలకే పరిమితం కావాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు వివిధ కేంద్రాల్లో పనిచేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎంఎల్‌హెచ్‌పీ), ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఇక నుంచి ఒక టీమ్‌గా అయుష్మాన్ భారత్ ఆరోగ్య ఉపకేంద్రాల్లో (సబ్ సెంటర్)లో సమన్వయంతో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. వీరంతా రోజూ క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించడంతో పాటు నిత్యం మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంబంధిత సబ్‌సెంటర్‌లో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందేనని స్పష్టంచేసింది. వార్డు, గ్రామ సచివాలయాల్లో ఇంతవరకు పనిచేసిన ఏఎన్‌ఎంలు సంబంధిత సచివాలయాల శాఖనుంచే జీతభత్యాలు తీసుకుంటారు గాని, వారికి డ్యూటీ సర్టిఫికెట్‌ను మాత్రం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మార్పులతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గతంలో వున్న 633 సబ్‌సెంటర్లు మళ్ళీ పునఃప్రారంభంకావడంతో పాటు, వాటిని ఇక మీదట ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య సబ్ సెంటర్లుగా పిలుస్తారు.


ద్వారకాతిరుమల ఆలయం వద్ద నిరసన తెలుపుతున్న జన సైనికులు

జన సైనికుల ప్రాయశ్చిత్త పూజలు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 30: తిరుపతి లడ్డూ అపవిత్రతపై పాయఃశ్చిత్త కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీవారి ఆలయ మెట్లను జన సైనికులు శుభ్రం చేసి పసుపుకుంకుమలతో పూజలు చేశారు. అనంతరం దీపాలు వెలిగించారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సువర్ణరాజు నేతృత్వంలో నాలుగు మండలాల అధ్యక్షులు, వీర మహిళలు పాల్గొన్నారు.ముందుగా వారంతా స్వామి వారి పాదుకామండపం వద్దకు చేరుకుని కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం క్షమించు స్వామీ అంటూ వేడుకున్నారు. వీరమహిళలు చింతల్ కుమారి, మాధవి, సీతారత్నకుమారి, అరుణతో పాటు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆఖరి మజిలీ.. ఆనందంగా..



ప్రేమానుబంధాలతోనే వృద్ధాప్యంలో ఆరోగ్యం

అరవై ఏళ్ల వయసంటేనే భయపడే పరిస్థితుల నుంచి ఇప్పుడు కొంచెం బయటపడుతున్నారు. ఇప్పుడు మనిషి సగటు ఆయుర్దాయం 68 ఏళ్లకు పెరిగింది. వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలంటే పరిస్థితులను తమకు అనుకూలంగా మలచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వయసులో తమ శక్తియుక్తులన్నింటినీ పిల్లల ఎదుగుదలకు, అభివృద్ధికి వెచ్చించిన అమ్మా,నాన్నలను చివరిలో పిల్లలు ప్రేమతో చూసుకోవాలి. అప్పుడే వృద్ధాప్యం శాపంగా మారదు. నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. - పాలకొల్లు



ఆరేళ్ల పిల్లలు తల్లిదండ్రులను విడిచి ఎలా ఉండలేరో 60 ఏళ్లు దాటిన తల్లిదండ్రులు పిల్లల ఆసరా లేకుండా ఉండలేరనేది సత్యం. అయితే ఇప్పుడు వృద్ధులకు పిల్లల ఆసరా కరువైపోతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ జరిపిన సర్వేలో అధికశాతం వృద్ధులు చరమాంకంలో వివిధ అనారోగ్య, మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు వెల్లడైంది. అనారోగ్యంతో గడుపుతున్న వారి సంఖ్య 20 శాతం ఉండగా, సుమారు 15 శాతం వృద్ధులు మానసిక ఒత్తిడితో జీవిస్తున్నారు. 20 శాతం మంది అనారోగ్య సమస్యలతో, సుమారు 10 శాతం వృద్ధులు బిడ్డల సంరక్షణకు దూరమై కాయకష్టంతోనూ లేదా వృద్ధాశ్రమాల్లో జీవిస్తున్నారు. 30 శాతం పైబడి వృద్ధులు మానసిక, ఆర్థిక సమస్యలతో కాలం వెళ్లదీస్తున్నారు.

ప్రపంచ వృద్ధుల దినోత్సవం ప్రతిఏటా అక్టోబరు 1న జరుపుతున్నారు. తొలిసారిగా వియన్నాలో 1984లో వయోవృద్ధుల గురించి అంతర్జాతీయ సదస్సు జరిగింది. సీనియర్ సిటిజన్ అనే పదం కూడా ఈ సదస్సులో తొలిసారిగా వాడారు. 1991 అక్టోబరు 1న తొలి సారిగా ప్రపంచ వ్యాప్తంగా వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. 1950లో మనిషి సగటు ఆయుర్దాయం 46 సంవత్సరాలు ఉంటే అది 2010 నాటికి 68 ఏళ్లకు పెరిగింది. పెరుగుతున్న వైద్య సదుపాయాలు, సాంకేతికతతో రానున్న రోజుల్లో మనిషి సగటు ఆయర్దాయం మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రపంచంలో 2019 నాటికి అరవై ఏళ్లు దాటిన వారి సంఖ్య 70.3 కోట్లు ఉంటే 2050 నాటికి 150 కోట్లకు చేరే అవకాశం ఉందని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ అంచనా..

పెరుగుతున్న ప్రాణభయం

సహజంగానే వృద్ధాప్యంలో ప్రాణభయం పెరుగుతూ వస్తుంది. ఇప్పుడు అరవై ఏళ్ల వయసులో మనోధైర్యంతో ఉంటున్నప్పటికీ 65-70 ఏళ్లు వచ్చేసరికి ప్రాణభయం వెంటాడుతోంది. ఈ భయాన్ని జయించడానికి ఆ వయస్సులో పిల్లల ఆప్యాయతానురాగాలే వృద్ధులకు వరం అని చెప్పవచ్చు. పట్టణవాసం, నగరీకరణ పెరుగుతున్న నేపథ్యంలో ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోతున్నాయి. వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడే తీరిక యువతకు దొరకడం లేదు. వృద్ధులను ఆప్యాయంగా చూసుకుంటున్న కుటుంబాల్లో వృద్ధుల ఆయుర్ధాయం పెరుగుతుందని సర్వేలు వెల్లడిస్తున్నాయి.

చాదస్తంతో ఇబ్బందులు

వయసుపైబడి బాధ్యతలను బిడ్డలకు అప్పగించి కృష్ణా.. రామా.. అంటూ కాలం వెళ్లతీసే వృద్ధాప్యాన్ని ఇప్పుడు ధిక్కార స్వరాలు కుంగదీస్తున్నాయి. సంపాదనలో ఉన్నప్పుడు ఇంటిలో వారిని శాసించిన కుటుంబ పెద్ద వృద్ధాప్యం వచ్చేసరికి ధిక్కార స్వరానికి గురవుతున్నారు. 65 ఏళ్ల పైబడిన వృద్ధుల్లో సహజంగా చాదస్తం పెరుగుతుంది. చెప్పిందే చెబుతుండటం, చేసిందే చేయడం చేస్తుంటారు. అయితే ఈ విధానాలను పిల్లలు తప్పు పట్టకుండా ఒక్కసారి తమ బాల్యాన్ని గుర్తుచేసుకోవాలి. చిన్నతనంలో చెప్పిందే చెప్పి, అడిగిందే అడిగి తల్లిదండ్రులను విసిగిస్తారు. అయినప్పటికీ తల్లిదండ్రులు ఓర్పుతో సమాధానం చెబుతారు. అదేవిధంగా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చిన్న పిల్లలుగా భావిస్తే ఇబ్బందే ఉండదు. ఉద్యోగం లేదా వ్యాపారాలతో బిజీగా ఉన్నప్పటికీ రోజుకు కనీసం ఒక గంట గృహ సంబంధాలకు విలువ ఇవ్వాలని సూచిస్తున్నారు. ఆప్యాయంగా అమ్మా.. నాన్నా.. అని పిలిచే పలకరింపులే వారికి ఆనందాన్ని,ఆరోగ్యాన్ని ఇస్తున్నాయి.

చాలినంత సమయం నిద్రపోవాలి

వృద్ధాప్యంలో ప్రశాంతమైన నిద్ర ఒక వరం. అయితే అధికశాతం వృద్ధులకు నిద్ర కరువవుతూ ఉంటుంది. రోజుకు 8 గంటలకు తక్కువ కాకుండా నిద్రిస్తే ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. వివిధ అనారోగ్యాల నుంచి తప్పించు కోవడానికి సరిపడినంత నిద్ర ఒక ఔషధమని వైద్యవర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా 60 ఏళ్ల పైబడి వయసులో పిల్లలు తమను పట్టించుకోరన్న అభద్రతాభావం, ఆందోళన వెంటాడుతున్నాయి. పిల్లలు వారి భయాలు పోగొట్టి అభయాలు ఇవ్వడం ద్వారానే వృద్ధుల శేష జీవితం సాఫీగా సాగుతుంది.



వాహనంలో 'ఇస్రో' ప్రదర్శనలను తిలకిస్తున్న విద్యార్థులు... పరిశీలిస్తున్న డీఈవో, తదితరులు

అబ్బురపరిచిన అంతరిక్ష ప్రదర్శనలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 30 : అంతరిక్షరంగంలో భారత్ సాధించిన విజయాలు, ఉపగ్రహాల ప్రయోగాలు, శాస్త్ర సాంకేతికరంగంలో భారతీయ శాస్త్రవేత్తల అద్భుతాలు తదితర ప్రదర్శనాంశాలు, వర్కింగ్ మోడళ్ళతో సోమవారం ఏలూరు సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలు ఆవరణలో 'ఇస్రో' వాహనం 'స్పేస్ ఆన్ వీల్స్' విద్యార్థులను అబ్బురపరిచింది. ఏలూరు డివిజన్ పరిధిలోని వివిధ మండలాలు, నగర పరిధిలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఇస్రో వాహనంలో అమర్చిన ప్రదర్శలను తిలకించారు. చంద్రయాన్ మిషన్, మంగళ్‌యాన్, ఆదిత్య ఎల్-1 మిషన్, శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగకేంద్రం ఉపగ్రహ వాహకనౌకల లాంచింగ్ ప్యాడ్‌ల నమూనాలు, ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం, భారతదేశం ప్రయోగించిన పలు ఉపగ్రహాలతో దేశానికి లభించే ప్రయోజనాలు, వాతావరణంలో వచ్చే వివిధ మార్పులు, తుపానులు వంటివి ముందుగానే తెలుసుకునే రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ సిస్టం, టెలీ కమ్యూనికేషన్ వ్యవస్థకు వాడే ఇండియన్ శాటిలైట్ కమ్యూనికేషన్ సిస్టం వంటి నమూనాలను ప్రదర్శించారు.

భారతీయ విజ్ఞాన శాస్త్రవేత్తలకు చెందిన సమాచారంతో కూడిన 108 చార్టులను ప్రదర్శించారు. ప్రదర్శనను ప్రారంభించిన డీఈవో అబ్రహం మాట్లాడుతూ ప్రపంచదేశాల్లో 'ఇస్రో' సామర్థ్యాన్ని, విజయాలను తెలుసుకోవడం ద్వారా సైన్సుపట్ల ఆసక్తిని పెంపొందించుకోవడమే గాక, భవిష్యత్ శాస్త్రవేత్తలుగా విద్యార్థులు ఎదిగేందుకు ఇది ఉపయోగపడు తుందన్నారు. అంతరిక్ష ప్రయోగాలు, ఇస్రో విజయాలపై విద్యార్థులకు స్పేస్ రంగోలి, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను డీఈవో అందజేశారు. సమగ్రశిక్ష ఏఎంవో రెడ్డి రామారావు, స్కూలు ప్రిన్సిపాల్ సాయికుమారి శంకర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రదర్శనను స్పేస్ ఆన్ వీల్స్ జిల్లా కో-ఆర్డినేటర్ స్వర్ణ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

లారీ ఢీకొని ఎలక్ట్రీషియన్ మృతి

ఇద్దరికి గాయాలు



పెంటపాడు, సెప్టెంబరు 30: మండలంలోని ప్రత్తిపాడులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. మండలంలోని బీ.కొండే పాడు గ్రామానికి చెందిన బాలం గంగా మల్లేశ్వరరావు (30) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి గంగా మల్లేశ్వరరావు, స్నేహితులు గుబ్బల దినేష్, బిల్లా చందులతో కలసి మోటర్ సైకిల్‌పై తాడేపల్లిగూడెం వెళ్తున్నారు. ప్రత్తిపాడు జాతీయ రహదారి జంక్షన్ సమీపంలో ఏలూరు నుంచి ప్రత్తిపాడు బియ్యం లోడుతో వెళ్తున్న లారీ వీరిని ఢీకొట్టింది. ప్రమాదంలో గంగామల్లేశ్వరరావు తలకు బలమైన గాయం కావడంతో అక్క డికక్కడే మృతిచెందాడు. మిగిలిన ఇద్దరికి గాయాలు కావడంతో స్థానికులు తాడేపల్లి గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పెంటపాడు ఎస్‌ఐ స్వామి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు, బస్సు ఢీ..ఇద్దరికి గాయాలు

పాలకోడేరు, సెప్టెంబరు 30: కారును బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి స్వల్పగాయాలైన సంఘటన వేండ్ర గ్రామంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వేండ్రవైపు నుంచి భీమవరం వైపు వస్తున్న భీమవరంలోని ఆదిత్య కళాశాలకు చెందిన బస్సు భీమవరం వైపు నుంచి వేండ్ర వైపు వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. బస్సులో విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పాలకోడేరు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్ళి ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా క్రమబద్ధీకరించారు. గాయాలైన చిన్నారులను స్థానికులు పాలకోడేరు ఆసుపత్రికి తరలించారు.

మోటార్ స్విచ్ వేస్తుండగా షాక్.. ఒకరి మృతి

యలమంచిలి, సెప్టెంబరు 30: దొడ్డిపట్ల గ్రామానికి చెందిన కొండేటి రామారావు (50) విద్యుత్తు షాక్ తగలడంతో మృతి చెందినట్లు ఎస్‌ఐ గుర్రయ్య తెలిపారు. రామారావు తన ఇంటి ఆవరణలో ఉన్న విద్యుత్తు మోటారు స్విచ్ ఆన్ చేశాడు. కొబ్బరి ఆకు మోటారుకు సంబంధించిన విద్యుత్తు వైరుపై పడటంతో వైరు తెగి రామారావుపై పడి విద్యుత్తు షాక్ తగిలింది. దీంతో రామారావు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

భీమవరంలో యువకుడి ఆత్మహత్యాయత్నం

భీమవరం క్రైం, సెప్టెంబరు 30: భీమవరం పట్టణానికి చెందిన ఒక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపిన వివరాలు ప్రకారం నర్సయ్య అగ్రహారానికి చెందిన

క్రైమ్ కార్నర్

మణికంఠ (30) అనే యువకుడు లెప్రసీ కాలనీలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో స్థానికులు వెంటనే భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సీఐ ఆసుపత్రికి వెళ్ళి వివరాలు సేకరించారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో ఏలూరు పంపించినట్లు తెలిపారు. పూర్తి వివరాలు సేకరిస్తున్నామని సీఐ తెలిపారు.

విదేశీ కరెన్సీ ఇస్తామని రూ. 2 లక్షలు దోపిడీ

మొగల్తూరు,సెప్టెంబరు 30: విదేశీ కరెన్సీ నోట్లు ఇస్తామని ఇందుకు దేశీయ కరెన్సీ నోట్లు ఇవ్వాలని ట్రాప్ చేసి ఒక వ్యక్తిని మోసం చేసిన సంఘటన మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి జాతీయ రహదారి రాజుగారి తోట క్రాస్ రోడ్స్ వద్ద సోమవారం జరిగింది. నరసాపురం రూరల్ సీఐ దుర్గా ప్రసాద్ తెలిపిన కథనం ప్రకారం తూర్పుగోదావరి జిల్లాకు సఖినేటి పల్లికి చెందిన రాపాక చంద్రరావు అనే వ్యక్తి ప్రస్తుతం కలిదిండిలో నివాసం ఉంటున్నాడు. చంద్రరావు విదేశీ కరెన్సీ నోట్లు, విదేశీ సెంటు బ్యాటిల్స్, విదేశీ వస్తువులు కొంటుంటాడు. దీంతో తూర్పుగోదావరి జిల్లా నుంచి ఒక వ్యక్తి చంద్రరావుకు ఫోన్ చేసి నావద్ద విదేశీ కరెన్సీ ఉంది. ఇందుకు దేశీయ కరెన్సీ నోట్లు రూ.2 లక్షలు తీసుకురమ్మని ఆ వ్యక్తి ఫోన్‌లో చెప్పాడు. చంద్రరావు కలిదిండి నుంచి నగదుతో రాజుగారి తోట క్రాస్ రోడ్డు వద్దకు వచ్చే సరికి గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి అతనిపై దాడి చేసి రూ.2 లక్షలు నగదు దోచుకుపోయారు. దీంతో లబోదిబోమన్న చంద్రరావు మొగల్తూరు పోలీసులను ఆశ్రయించాడు. రూరల్ సీఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ రాజేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం..కేసు నమోదు

భీమవరం క్రైం, సెప్టెంబరు 30 : ఒక వ్యక్తి తన సోదరిడికి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి డబ్బు తీసుకుని మోసం చేశాడంటూ భీమవరం 39వ వార్డుకు చెందిన ఒక మహిళ టూటౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన పెద్ది కృష్ణమోహన్ అనే వ్యక్తికి భీమవరానికి చెందిన మహిళ చిన్ననాటి నుంచి పరిచయం ఉంది. దీంతో కృష్ణమోహన్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆమెతో మాట్లాడటం ప్రారంభించాడు. దీంతో అది నమ్మిన మహిళ తన సోదరుడుకు ఉద్యోగం కావాలని చెప్పడంతో ఇప్పిస్తానని చెప్పి రెండు దఫాలుగా ఒక లక్షా 8 వేలు రూపాయలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోవడంతో ఆ మహిళ కృష్ణమోహన్‌ను నిలదీయడంతో డబ్బు ఇవ్వనని చెప్పడమే కాకుండా ఆ మహిళ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి లేనిపోనివి చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రెహమాన్ తెలిపారు.

గంజాయి స్వాధీనం.. నలుగురి అరెస్టు

భీమవరం, క్రైం, సెప్టెంబరు 30 :విశాఖ ఏజెన్సీ నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తుల్ని అరెస్టు చేసినట్లు భీమవరం వన్ టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. భీమవరం పెదపేటకు చెందిన గంటి అరుణ్‌కుమార్ (నాని), యేనేపల్లి కృష్ణవంశీ (చింటూ) ఇద్దరు కలిసి విశాఖ ఏజెన్సీ నుంచి గంజాయి తీసుకువచ్చి సోమవారం పెదపేట రైల్వే ట్రాక్ వద్ద పాలకోడేరు మండలం వేండ్ర గ్రామానికి చెందిన గుబ్బల నవీన్‌కుమార్ (పండు), దుర్గాపురానికి చెందిన పంతగాని ఏసురాజుకు విక్రయిస్తున్నారు. పక్కా సమాచారంతో సీఐ దాడి చేసి ఆ నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద ఆరు కేజీల గంజాయి (రూ.30,000), నాలుగు సెల్‌ఫోన్‌లు, రూ.1000 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరుణ్‌కుమార్, కృష్ణవంశీ నవీన్‌కుమార్‌లపై గతంలో కూడా కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు.



కుదిరితే.. కప్పు కాఫీ..

చాలా ఇళ్లల్లో కాఫీతోనే ఉషోదయం..

ఉమ్మడి జిల్లాలో 10 లక్షలు మంది కాఫీ ప్రేమికులు

చాలా ఇళ్లల్లో కాఫీతోనే ఉషోదయం అవుతుంది. ఉదయం చేతికి కాఫీ కప్పు అందితే గానీ నిద్రలేవని వారు చాలామంది ఉన్నారు.. మద్యం లాగే కాఫీ కూడా ఒక వ్యసనమే.. కాఫీ గొంతులో పడితే గానీ పని ముందుకు నడవదు.. నేడు అంతర్జాతీయ కాఫీ దినోత్సవం.. వరల్డ్ కాఫీ డేని తొలిసారిగా 2015 అక్టోబరు 1వ తేదీన నిర్వహించారు. కాఫీ ప్రేమికులను గుర్తిస్తూ కాఫీ పండించే రైతులకు మద్దతినిస్తూ ప్రపంచ వ్యాప్తంగా కాఫీ డేని నిర్వహిస్తున్నారు..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కాఫీ ప్రేమికులు సుమారు 10 లక్షలు మంది ఉన్నారంటే ఆశ్చర్యం కలగక మానదు. అంటే ప్రతీ నలుగురులోనూ ఒకరు ఉదయాన్నే కాఫీని ఆశ్వాదిస్తారు. కాఫీలో నాడీ వ్యవస్థను ఉత్తేజం చేసే కెఫెన్ అనే పదార్థం ఉండటం కారణంగా కాఫీ తాగిన వెంటనే ఉత్తేజం పొందుతారు. అత్యధికంగా ప్రపంచంలోనే అమెరికన్‌లలో 63 శాతం మందికి కాఫీ తాగే అలవాటు ఉంది. ప్రపంచ వ్యాప్తంగా 3 బిలియన్లు మంది కాఫీని ప్రతీ నిత్యం ఆశ్వాదిస్తారు. తొలిసారిగా ఇథియోపియా దేశంలో 870వ సంవత్సరంలో కాఫీ గింజలను వినియోగించారు. మనదేశంలో ఈశాన్య రాష్ట్రాలైన అసోం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, త్రిపుర, అరుణాచల ప్రదేశ్ రాష్ట్రాలు 3వ వంతు కాఫీ గింజలు ఉత్పత్తి చేస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రంలో అత్యధికంగా 71 శాతం, కేరళలో 21 శాతం కాఫీ పండిస్తున్నారు.

ఆహా.. అరకు కాఫీ

రాష్ట్రంలోని అరకు ప్రాంతంలోని కాఫీ ఉత్పత్తికి ఇటీవల జాతీయ స్థాయి అవార్డు వచ్చింది. అరకు కాఫీ పేరు చెప్పగానే ఆహా అనవలసిందే. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ సైతం అరకు కాఫీ రుచి చూసి అబ్బురపడ్డారు. విదేశాలలో సైతం కాఫీ ప్రియులను అరకు కాఫీ మనసు గెలుచుకుంది. ఒక జిల్లా..ఒక ఉత్పత్తి (ఓడీ ఓపీ) పేరుతో జాతీయస్థాయి అవార్డుకి అరకు కాఫీ ఎంపికైంది.

మితంగా తాగితే కాఫీ మంచిదే

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 90 శాతం పైబడి కాఫీ ప్రియులు పాలతో కలిపి సేవిస్తుండగా స్వల్ప సంఖ్యలో బ్లాక్ కాఫీ తాగుతున్నారు. చర్మ సౌందర్యం, ఆరోగ్యరక్ష పేరుతో సంపన్న వర్గాలలో 4, 5 శాతం మంది బ్లాక్ కాఫీ సేవిస్తున్నారు. జిల్లాలో ఇప్పుడు సంప్రదాయ కాఫీ పొడితో తయారు చేసే ఫిల్టర్ కాఫీతో పాటు ఇనిస్టంట్ కాఫీ పొడులను అధికంగా ఉపయోగిస్తున్నారు. రోజులో రెండు పర్యాయాలు కాఫీ సేవించడం ఆరోగ్యానికి మంచిదని చెబుతున్నారు. అయితే మితిమీరి సేవించడం ప్రమాదకరమని చెబుతున్నారు. కాఫీ తాగేవారిలో జుట్టు నిగారింపు ఉండటమే కాకుండా చర్మం బిగుతుగా ఉంటుందని నమ్ముతారు. ఒంటిపై నల్లమచ్చలు , ముఖంపై మొటిమలు తగ్గుతాయని కాఫీ ప్రేమికులు చెబుతారు.

- పాలకొల్లు



గోకుల పారిజాతగిరిలో ముగిసిన పవిత్రోత్సవాలు

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 30: జంగారెడ్డిగూడెం గోకుల పారిజాత గిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు, పానంగిపల్లి సత్యపవన్ కుమార్ ఆధ్వర్యంలో పూర్ణాహుతి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి శాంతి కళ్యాణం నిర్వహించారు. రుత్వికులను ఈవో మానికల రాంబాబు ఘనంగా సత్కరించారు. అర్చకులు ఋషికేష్ , కుమారాచార్యులు, రాఘవాచార్యులు పూజలు నిర్వహించారు.

ఏలూరులో కత్తులతో దాడి ఒకరికి తీవ్ర గాయాలు



ఏలూరు క్రైం, సెప్టెంబరు 30 : గంగానమ్మ జాతరలో డీజే పాటలకు డాన్సు వేసే సమయంలో రెండు వర్గాల మధ్య గొడవలు జరిగాయి. అర్ధరాత్రి జాతర ముగిసిన తరువాత కత్తులతో ఒక వ్యక్తిని పరిగెత్తించి కత్తులతో దాడి చేశారు. తీవ్ర గాయాలకు గురైన అతనిని తొలుత ఏలూరు ప్రభుత్వా సుపత్రికి అనంతరం విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఏలూరు టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం తంగెళ్ళమూడి ప్రాంతం జంగారెడ్డిగూడెం రోడ్డులోని పెనియేలు చర్చి ఎదురుగా ఉన్న ప్రాంతంలో ఈనెల 29వ తేదీ రాత్రి గంగానమ్మ జాతర జరిగింది. ఆ జాతరకు డీజేలతో ఊరేగింపు పెట్టారు. డీజే సౌండ్‌తో పాటలు పెట్టి డాన్సులు వేసే సమయంలో అదే ప్రాంతానికి చెందిన మానుకొండ గంగాధర్ (38)కి సాయి, మరికొందరితో పాట విషయంపై గొడవ జరిగింది. జాతర ముగిసిన తరువాత అర్ధరాత్రి ఇంటికి వెళ్తున్న గంగాధర్‌పై సాయి, రామయ్య, సురేష్, నత్తెమ్మ మనుమడు మల్లిపూలు, అనే ఐదుగురు కలిసి కత్తులతో దాడి చేశారు. అదే సమయంలో మిగిలిన యువకులు అడ్డం తిరిగి కేకలు వేయడంతో వారు పారిపోయారు. గాయాల పాలైన గంగాధర్‌ను వెంటనే ఏలూరు ప్రభుత్వా సుపత్రికి తీసుకురాగా మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉందని చెప్తున్నారు. ఏలూరు టూటౌన్ సీఐ వైవీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌పై వచ్చి మహిళ మెడలో గొలుసు చోరీ

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 30:గుర్తు తెలియని దుండగులు మహిళ మెడలో బంగారు గొలుసును తెంపుకుపోయిన ఘటన సోమవారం రాత్రి పట్టణంలో జరిగింది.జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన మాదాసు సిద్ధాయమ్మ సోమవారం తన మూడవ కుమార్తెతో కలిసి పట్టణంలోని త్రివేణి కళాశాల వద్ద నివాసముంటున్న తన రెండో కుమార్తె ఇంటికి వచ్చారు.పని ముగించుకుని తిరిగి స్వగ్రామం వేగవరం వెళ్లడానికి సోమవారం రాత్రి పాత తహసీల్దారు కార్యాలయం రోడ్డులో నడుచుకుంటూ వస్తుండగా గుర్తుతెలియని యువకుడు ద్విచక్ర వాహనంపై వచ్చి సిద్ధాయమ్మ మెడలో ఉన్న పుస్తెలతాడును లాగబోయాడు. దీంతో సిద్ధాయమ్మ తేరుకుని తన పుస్తెల తాడును గట్టిగా పట్టుకోగా మెడలో ఉన్న బంగారు నల్లపూసల గొలుసు తెంచుకు పారిపోయాడు. సిద్ధాయమ్మ కింద పడిపోగా స్వల్పగాయాలయ్యాయి. సీఐ కృష్ణబాబు వివరాలు సేకరించారు.

మున్సిపల్ టీచర్ల పనిసర్దుబాటును వెనక్కితీసుకోండి



డీఈవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న నేతలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 30: ఏలూరు నగరపాలకసంస్థ పాఠశాలల్లో 12మంది ఉపాధ్యాయులకు ఇతర యాజమాన్య పాఠశాలల్లో సర్దుబాటును వెనక్కి తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘ నేతలు కోరారు. ఇది నిబంధలనకు విరుద్ధమని టీడీపీ అనుబంధ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.రమణారావు, టి.మురళి సోమవారం డీఈవో అబ్రహంకు వినతిపత్రాన్ని అందజేశారు. వేలేరుపాడు మండలం ఎస్సార్ నగర్ స్కూలులో ఇద్దరు టీచర్లు మాత్రమే పనిచేస్తున్నారని, అక్కడ సబ్జెక్టు టీచర్లులేని కారణంగా విద్యార్థులు సరిహద్దు తెలంగాణ ప్రాంతానికి తరలివెళ్ళిపోయారని డీఈవోకు వివరించారు. సంబంధిత పాఠశాలలో ఉపాధ్యాయులను లేదా విద్యా వలంటీర్లను నియమించాలని కోరారు. పని సర్దుబాటును మరోదఫా సమీక్షించి విద్యార్థులు ఎక్కువమంది వున్న పాఠశాలలకు సర్‌ప్లస్ టీచర్ల సర్దుబాటుపై పరిశీలించాలని అభ్యర్థించారు.

పేద విద్యార్థినులకు ఎస్పీ కిశోర్ చేయూత



దుస్తులు అందిస్తున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 30: తల్లిదండ్రులు పేదవారని, చదువుకోడానికి సాయం చేయాలని కోరిన ఇద్దరు బాలికలకు ఎస్పీ కేపీఎస్ కిశోర్ చేయూతనిచ్చారు. ఏలూరు జిల్లా శ్రీ సత్య సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. చింతలపూడి మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన పసుపులేటి పుల్లారావు, కృష్ణవేణి దంపతులకు భువనేశ్వరి, గీతాంజలి కుమార్తెలు ఉన్నారు. వారు చదువుకోవాలని ఉందని చేసిన విజ్ఞప్తితో ఎస్పీ చొరవతో శ్రీ సత్యసాయి సేవా సంఘం ప్రతినిధులు రూ.15 వేల నగదు, రూ.10 వేల విలువైన ఆహార పదార్థాలు, దుస్తులను సోమవారం అందజేశారు. ప్రతినెలా వారికి అమృత కలశం ద్వారా నెలకు సరిపడే ఆహార పదార్థాలను అందజేస్తామని సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, సత్య సాయి సమితి అధ్యక్షుడు కె.శశిశేఖర్, పి.రామారావు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చింతలపూడి పట్టణ సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

చింతలపూడి, సెప్టెంబరు 30: పట్టణంలో సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేపడతామని సీపీఐ జిల్లా నాయకులు ఎం.వసంతరావు అన్నారు. సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ నగర పంచాయతీగా మారి నాలుగేళ్లు కావస్తున్నా పట్టణంలో కనీస సౌకర్యాలు లేవన్నారు. ఇంటి పన్నులు, కుళాయి పన్నులు పెంచారే తప్ప అభివృద్ధి పనులు ఏమీ జరగలేదన్నారు. పట్టణంలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి 1993లో ఆమోదించిన మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని, రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలని సూచించారు. కె.గురవయ్య టి.బాబు, ఎస్.కె.జాని, రామిరెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు



అవగాహన కార్యక్రమం నిర్వహించిన విద్యార్థులు

దెందులూరు, సెప్టెంబరు 30: ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ముప్పు అని, కాగిత, నార సంచులను వాడాలని దెందులూరు సర్పంచ్ తోట ఏసమ్మ సూచించారు. నర్సింగ్ కాలేజీ విద్యార్థులతో ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీలత, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ చౌదరితో కలిసి ఎన్‌టీఆర్ సర్కిల్, లైబ్రరీ, సంతపేట మీదుగా నర్సింగ్ కాలేజీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్లాస్టిక్ వాడడం వలన కలిగే నష్టాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సుగ్గిశెట్టి సూకరాజు, పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన నేతలు

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 30: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సెట్‌వెల్ సీఈవో కె.ప్రభాకర్, ఇరిగేషన్ డీఈఈ దేవరకొండ వెంకటేశ్వర్లు అన్నారు. అంబేడ్కర్ ఏలూరు విచ్చేసి 80 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు నివాళులర్పించారు. ఆర్ఐవో చంద్రశేఖర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రాంబాబు మాట్లాడుతూ అంబేడ్కర్ 1944 సెప్టెంబర్ 30న ఏలూరు వచ్చారన్నారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు, నేతల రమేష్‌బాబు, చాగంటి సంజీవ్, డీఈ జీ.వెంకటేశ్వరరావు, దాసరి నాగేంద్రకుమార్, మెండెం సంతోష్‌కుమార్, నేతర అజయ్‌బాబు, పళ్ళెం ప్రసాద్, సీహెచ్.సాయిబాబు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.3 లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న కూటమి నాయకులు

లింగపాలెం, సెప్టెంబరు 30: సీఎం రిలీఫ్ ఫండ్ నిమిత్తం టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో రూ.3లక్షల విరాళం అందజేశారు. మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు, మోరంపూడి మల్లికార్జునరావు, బొంతు రాంబాబు, బొంతు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రూ.3లక్షలు ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు అందజేశారు. వరద బాధితులకు ప్రభుత్వంతో పాటు తమవంతు సాయంగా విరాళం అందిస్తున్నట్లు వారు తెలిపారు. తాతిన రాధాకృష్ణ, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రామరాజు, సీతారామలక్ష్మికి గన్ని సత్కారం



రామరాజు, సీతారామలక్ష్మిని సత్కరిస్తున్న గన్ని

భీమడోలు, సెప్టెంబర్ 30: ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజును టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఘనంగా సత్కరించారు. సోమవారం గన్ని ఇంటికి వచ్చిన రామరాజు, తెలుగుదేశం నాయకురాలు తోట సీతారామలక్ష్మికి గన్ని వీరాంజనేయులు శాలువాలు కప్పి సత్కరించారు. కార్పొరేషన్ చైర్మన్‌గా రాష్ట్రానికి మెరుగైన సేవలందించాలని ఆకాంక్షించారు. తెలుగుదేశం నాయకులు పుల్లయ్యనాయుడు, పెద్దిరాజు, గంధం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి విస్తరణకు సర్వే



జీలుగుమిల్లిలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

జీలుగుమిల్లి, సెప్టెంబరు 30: రాష్ట్ర సరిహద్దు తాటియాకులగూడెం నుంచి జీలుగుమిల్లి మీదుగా పట్టిసీమ వరకు నిర్మించే జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఎన్‌హెచ్ బృందం సోమవారం సర్వే జరిపారు. నాలుగు రోడ్ల వీస్తీర్ణంతో 365 బీబీ ఎన్‌హెచ్ రోడ్డు నిర్మాణం పనులు త్వరలో ప్రారంభిస్తామని ఏఈ ఖాజా చెప్పారు. ఎలైన్మెట్ పనులు పూర్తయిన అనంతరం 70 అడుగుల విస్తీర్ణంలో రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. మరోవైపు ఇళ్ల వ్యాపార దుకాణాల్ని కోల్పోయే స్థానికుల వివరాలు రెవెన్యు అధికారులు సేకరించారు.

భూ సమస్య శాంతియుతంగా పరిష్కరించుకోవాలి

జీలుగుమిల్లి, సెప్టెంబరు 30: పి.నారాయణపురంలో భూ సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని తహసీల్దారు బి.సందీప్ అన్నారు. గతంలో ఇక్కడ సర్వే నెం.218/3, 221,లో 21 ఎకరాల భూమిని కొరుటూరు నిర్వాసితులకు ప్రభుత్వం కేటాయించింది. ఇటీవల ఆ భూముల్లో పామాయిల్, అంతర పంటగా వేరుశన పండిస్తున్నారు. రెండు రోజుల క్రితం గిరిజనులు కొంత పంటను ధ్వంసం చేశారు. నిర్వాసితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్సై పి.నవీన్‌కుమార్ పరిశీలించారు. తహసీల్దారు సందీప్ స్థానిక గిరిజల పత్రాల్ని రెవెన్యూ కార్యాలయంలో చూపించాలని, సమస్య శాంతియుతంగా పరిష్కరించుకోవాలని చెప్పారు.



దెందులూరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు



గిరిజన దర్బార్ నిర్వహణపై ఆందోళన చేస్తున్న గిరిజనులు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు



బూర్గంపాడు బ్యాంకు వద్ద ధర్నా చేస్తున్న రైతులు

సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన

సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లాలో పలుచోట్ల ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఐటిడీఏలో గిరిజన దర్బార్ నిర్వహణ, కొవ్వలి ఉన్నత పాఠశాల వద్ద ఆకతాయిల వేధింపులు, టి.నరసాపురం మండలంలో ఆశా వర్కర్ తొలగింపు, కలెక్టరేట్ వద్ద వీహెచ్‌పీ ఆధ్వర్యంలో, ప్రైవేటు బ్యాంక్ తీరుపై కుక్కునూరు మండల రైతులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు.

గిరిజన దర్బార్ బుధవారం నిర్వహించాలి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 30: కేఆర్.పురం ఐటీడీఏలో గిరిజన సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే గిరిజన దర్బార్‌ను బుధవారం నాడు నిర్వహించాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, ఆదివాసీ గిరిజనులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు పి.శ్రీనివాస్, ఎస్.రామ్మోహన్, కారం రాఘవ మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, ఏలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో వందలాది మంది గిరిజనులు ఐటీడీఏకు 70 నుంచి 100 కిలో మీటర్ల దూరంలో ఉన్నారన్నారు. గిరిజనులు ప్రతి బుధవారం కన్నాపురం, కొయ్యలగూడెం మండలాల్లో వారపు సంతలకు వస్తారని, అదే రోజు ఐటీడీఏ అధికారులను కలిసి సమస్యలపై వినతిపత్రాలు ఇస్తారన్నారు. గిరిజన దర్బార్ సోమవారం నాటికి మార్పు చేస్తే గిరిజనులకు అదనపు భారం అన్నారు. అధికారులు పరిశీలించి బుధవారమే గిరిజన దర్బార్ నిర్వహించాలని ఏపీవో పీవీఎస్ నాయుడికి వినతిపత్రాన్ని అందజేశారు. సర్పంచ్‌లు కోర్స గంగరాజు, కారం లక్ష్మి, కెచ్చెల ముక్కారెడ్డి, ఎం.శ్రీరాములు, చూంద్రు శారద, ఎంపిటిసిలు కొవ్వాసి గోవిందరాజు, మడకం వెంకటలక్ష్మి, ప్రజా సంఘాల నాయకులు టి.బాబురావు, కె.లత, గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వలి హైస్కూల్ వద్ద ఆకతాయిలు

దెందులూరు: కొవ్వలి హైస్కూల్ వద్ద కొందరు ఆకతాయలు పాఠశాల విద్యార్థినులకు ఇబ్బంది కలిగిస్తూన్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కసూకుర్తి రామకృష్ణ, నిట్లా సుభాకర్‌రావు కోరారు. తహసీల్దార్ సుమతికి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన కొంత మంది ఆకతాయిలు యువత మద్యం తాగి కొంతమంది ఆడపిల్లలను ఏడిపిస్తున్నారని, ఎన్నిసార్లు మందలించిన వినడం లేదన్నారు. బాలికలు స్కూల్ మానేసే పరిస్థితులు వచ్చాచని వెంటనే చర్యలు తీసుకుని పోలీసు బీట్ ఏర్పాటు చేయాలని చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని దెందులూరు ఎస్ఐ స్వామికి తహసీల్దార్ సుమతి సూచించారు,

ఆశా వర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలి

● టి.నరసాపురం: విధుల నుంచి తొలగించిన గండిగూడెం ఆశా వర్కర్ కాసగాని లక్ష్మి మంగను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పోచమ్మ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పలువురు ఆశా వర్కర్లు ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రధాన సెంటర్లో మానవహారం, ర్యాలీ చేశారు. పోచమ్మ మాట్లాడుతూ ఆశావర్కర్ లక్ష్మీమంగను సచివాలయ ఎంఎల్ హెచ్ వేధించారని, వైద్యాధికారి చెప్పినా పట్టించుకోలేదన్నారు. రాజకీయ నాయకుల అండదండలతో లక్ష్మి మంగను సస్పెండ్ చేయించారన్నారు. ఆమెను ఉద్యోగంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆవావర్కర్లు ఎస్.జ్యోతి, కె.వనిత, ఈ.లక్ష్మి, దేవమాత తదితరులు ఉన్నారు.

దేవాలయాల నిర్వహణ హిందూ సంస్థలకు అప్పగించాలి

ఏలూరు రూరల్: హిందూ దేవాలయాల నిర్వహణ, ప్రభుత్వ నియంత్రణ నుంచి హిందూ ధార్మిక సంస్థలకు అప్పగించాలని కోరుతూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వీహెచ్‌పీ రాష్ట్ర సేవా ప్రముఖ్ సాయిరామ్ మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ అంశంపై సమగ్ర విచారణ జరిపించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. కె.సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ఇటీవల హిందూ దేవాలయాల నిర్వహణ లోపబూయిష్టంగా మారిందని, అక్రమాలు, వివాదాలు జరుగుతున్నాయని, దేవాలయాల నిర్వహణ హిందు ధార్మిక సంస్థలకు అప్పగించాలన్నారు. గడ్డం నాగరాజు, రాజశేఖర్, కె.కృష్ణప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిశోర్, రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కుక్కునూరు రైతుల ఆందోళన

కుక్కునూరు: ఒకసారి తీసుకున్న రుణ మొత్తం రెండుసార్లు రికవరి చేసిన బ్యాంకు అధికారుల తీరుకు నిరసనగా ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో తెలంగాణలోని బూర్గంపాడు ప్రైవేటు బ్యాంకు వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. రైతు సంఘం జిల్లా నాయకులు ఎం.వెంకటాచారి మాట్లాడుతూ ఒకసారి తీసుకున్న రుణాన్ని రెండు సార్లు రికవరి చేసి రైతుల నడ్డి విరిచారని బ్యాంకు అధికారుల తీరును విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వలన ముంపుకు గురవుతున్న కుక్కునూరు, వేలేరుపాడు రైతాంగానికి 2017లో రైతుల భూములను భూసేకరణ చేసి బ్యాంకుల ద్వారా నష్టపరిహారం చెల్లించారన్నారు. పరిహారం రాకముందు తెలంగాణలో ఉన్న బ్యాంకుల్లో రెతులు పంట రుణాలు తీసుకున్నారన్నారు. పంట రుణాలు రికవరీ చేసి మళ్ళీ పోలవరం పరిహారం అందిన తరువాత రెండో సారి రికవరీ చేశారని ఆరోపించారు. దాదాపు 150మంది రైతులకు అన్యాయం జరిగిందన్నారు. ఎన్నిసార్లు బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు ఆందోళన నిర్వహిస్తామన్నారు. పేరాల శ్రీనివాసరావు, ఎస్.సుబ్బారెడ్డి, రైతులు ఎం.వెంకట్రావు, శ్రీనివాసరావు, వెంకటరమణ, శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారులు ముందుండాలి



సమస్యల పరిష్కార వేదికలో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు, సెప్టెంబరు 30: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే మీకోసం కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌రావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, మరి కొందరు అధికారులు మాత్రమే హాజరు కావడంతో సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే స్వయంగా ఫోన్‌చేసి కార్యక్రమానికి రాకపోతే సహించేది లేదన్నారు. ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో అధికారులు ముందుండాలన్నారు. పలువురి నుంచి వినతులు స్వీకరించి వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. యిప్పిలి వెంకటేశ్వరావు, సంపంగి వేణుగోపాల తిలక్, పెనుబోయిన మహేశ్ యాదవ్, షేక్ జహీర్ అహ్మద్, దాసే శ్రీను, తదితరులు పాల్గొన్నారు అనంతరం కొవ్వలి గాంధీనగర్‌లోని బీసీ బాలుర వసతి గృహన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పరిశీంచారు. మరుగుదొడ్లు, వంటశాల పరిసరాలను పరిశీలించారు. వసతి గృహం అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరగతుందన్నారు. వార్డెన్ సత్యనారాయణను పిల్లలకు మరింత శుభ్రతతో రుచిగా భోజనం అందించి మంచి పేరు తెచ్చుకోవాలని చింతమనేని ఆదేశించారు. వారి వెంట టీడీపీ నాయకులు వెలమాటి అనిల్, కసూకూర్తి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

వైద్యుల రక్షణకు చర్యలు : ఎమ్మెల్యే రోషన్‌కుమార్

లింగపాలెం: ఆసుపత్రిలో రాత్రి వేళ పనిచేసే వైద్యుల రక్షణకు ప్రభుత్వం రక్షణ చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజిగూడెం పీహెచ్‌సీలో అర్ధరాత్రి తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రిలో సీసీ కెమెరాలు, చుట్టూ లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న రోగులను వైద్య సేవలపై ఆరా తీశారు. వారికి వైద్యఖర్చుల నిమిత్తం కొంత నగదు అందజేశారు. ఆయనతో పాటు గారపాటి నాగబుద్ధవరప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోలీసులు శాంతిభద్రతలను పరిరక్షించాలి

● కామవరపుకోట: శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. జలపావారి గూడెం రహదారి విషయమై సోమవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. బాధితులు తడికలపూడి పోలీసులను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రోషన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఎస్ఐ చిన్నారావుతో చర్చించి నిందితులపై కేసు నమోదు చేయాలన్నారు.

పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపారాధన

భీమడోలు, సెప్టెంబరు 30: ఉపముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా భీమడోలులో కూటమి నాయకులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపారాధన నిర్వహించారు. పవన్‌కల్యాణ్ సనాత ధర్మ పరిరక్షణ కోసం చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్ష విజయవంతం కావాలని కూటమి నాయకులు కోరారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కూటమి నాయకులు గన్ని నాగగోపాలరావు, ప్రత్తి మదన్, పుల్లయ్యనాయుడు, పెద్దిరాజు, నీలం అజయ్, దుర్గారావు, ఆదిరెడ్డి సత్యనారాయణ, శేషపుగిరి, కనుమూరి లీలా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా జనసేన నాయకులు నారా శేషు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. సత్రంపాడు లక్ష్మీసౌభాగ్యలక్ష్మీదేవి, శ్రీలక్ష్మీగణపతిస్వామి ఆలయాల్లో సోమవారం ఆలయ శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఉంగుటూరు:ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షలో భాగంగా శనివారం నారాయణపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపారాధనను జనసేన కార్యకర్తలు నిర్వహించారు.

ఘనంగా భూలోకమ్మ సంబరాలు

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 30: స్థానిక భావిశెట్టివారి పేట భూలోకమ్మ ఆలయం వద్ద పద్మశాలీల సంఘం ఆధ్వర్యంలో సంబరాలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

గుండెపోటుతో వల్లంపట్ల ఎంపీటీసీ మృతి

టి.నరసాపురం, సెప్టెంబరు 30: వల్లంపట్ల ఎంపీటీసీ గాది రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని వైసీపీ నేత శ్రీనురాజు, జడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు అన్నారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. తుమ్మూరి శ్రీనివాస రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

అవుట్‌సోర్సింగ్ లస్కర్ల వేతన బకాయి చెల్లించాలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 30: ఏలూరు జిల్లా ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ సోమవారం విజయవాడ సిఏడిఏ కార్యాలయంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ కర్రా శ్రీనివాస్‌ను కలిసి అవుట్‌సోర్సింగ్ లస్కర్ల పెండింగ్ జీతాల విషయం పై చర్చించినట్లు చోడగిరి శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రాష్ట్రవ్యాప్తంగా త్వరలో రూ.3కోట్లకు పైగా అవుట్‌సోర్సింగ్ లస్కర్ల జీతాలు విడుదల చేస్తామని తెలిపారని చోడగిరి తెలిపారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 30: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల్లో భాగంగా ఏలూరు నియోజకవర్గస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు సోమవారం అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగాయి. శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గారపాటి ప్రసాద్ పోటీలను ప్రారంభించారు. 14 ఏళ్ల నుంచి 17 ఏళ్ల బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు కోఆర్డినేటర్ పద్మలత తెలిపారు.

కుల వివక్ష నిర్మూలనకు ఉద్యమించాలి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 30: జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తితో కుల వివక్ష నిర్మూలకై నిమ్నజాతులవారు ఉద్యమించాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కెవి రమణ పిలుపు నిచ్చారు. సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు మహిళలపై జరుగుతున్న దాడులను, అత్యాచారాలను ఖండిస్తూ సోమవారం కె.కిషోర్ అధ్యక్షతన జరిగిన సభలో రమణ మాట్లాడారు. అధికారం కోసం కులాన్ని ఆయుధంగా వాడు కుంటున్నారని, వీటికి వ్యతిరేకంగా ఉద్యమించాలని తెలిపారు. మీసాల ఏసు, డి.బాబురావు, ఎం.నాగేంద్ర, పి.వీరాస్వామి, కె.రవికుమార్, చందు తదితరులు పాల్గొన్నారు.

విఠల్‌కుమార్‌కు మదర్ థెరిసా సేవారత్న పురస్కారం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 30: ఏపీ, బీసీ, టీబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌పీఆర్ విఠల్‌కుమార్‌కు గుంటూరు జిల్లా అమ్మఒడి చారిటబుల్ ట్రస్ట్ మదర్‌థెరిసా సేవారత్న పురస్కారాన్ని అందజేసింది. ట్రస్ట్‌చైర్మన్ అల్లాడి శ్రీనివాసరావు పురస్కారాన్ని అందచేశారు. విటల్‌కుమార్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గుర్తింపును తెచ్చుకున్నారు.ఈ క్రమంలో అవార్డును ఇచ్చి సత్కరించారు.



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కౌన్సిల్ సభ్యులు

అక్రమ లేఅవుట్ అనుమతిస్తారా..?

జంగారెడ్డిగూడెం మున్సిపల్ కౌన్సిలర్ల ఆగ్రహం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 30: పట్టణంలో అక్రమ లేఅవుట్‌గా గుర్తించిన వాటిని తిరిగి అనుమతించే అజెండా అంశంపై మున్సిపల్ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అశ్వారావుపేట రోడ్డులోని టౌన్ హాలు సమీపంలో వేసిన లేఅవుట్‌పై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏసీబీ విచారణ జరిపించాలని కౌన్సిలర్లు పట్టుబట్టడంతో ఈ మేరకు మున్సిపల్ సమావేశం తీర్మానం చేసింది. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో 30 అంశాలను కౌన్సిల్ తీర్మానం నిమిత్తం అజెండాలో చేర్చారు. వాటిలో లేఅవుట్ అనుమతి అంశంపై మున్సిపల్ వైస్ చైర్మన్లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, సభ్యులు ఎవి.రమణమూర్తి, సంకు సురేష్, మాదవరావు, రామచంద్రరాజు, తాతాజీ, ప్రియదర్శిని, రమాదేవి, జ్యోతి తదితరులు అభ్యంతరం తెలిపారు. ప్రజలను, ప్రభుత్వాన్ని మోసం చేసిన వారిని ఎందుకు పోత్సహిస్తున్నారని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2006లో జంగారెడ్డిగూడెం గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ఆర్ఎస్ నెంబర్ 359లో 9.40 ఎకరాల్లో రెండు లే అవుట్‌లు వేసి మౌలిక సదుపాయాలు కల్పించకుండా విక్రయించారన్నారు. పంచాయితీకి ఇచ్చిన పదిశాతం రిజర్వు భూమి కూడా విక్రయించినట్లు మున్సిపల్ అధికారులు గుర్తించినా ఆ లేఅవుట్ రద్దు చేసి తిరిగి కొత్తగా అనుమతి ఇవ్వడానికి అజెండాలో ఎలా చేర్చుతారని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే లేఅవుట్‌పై చర్యలు తీసుకోవాలని మూడు నెలల క్రితమే డీటీసీపీ నుంచి ఆదేశాలు వచ్చినా ఇప్పటి వరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. టౌన్‌ప్లానింగ్‌లో పనిచేసేవారంతా దొంగలని కౌన్సిలర్లు వ్యాఖ్యానించడంతో సమావేశం హాలంతా వేడెక్కింది. లే అవుట్ పై విజిలెన్స్, ఏసీబీ విచారణ జరిపించాలని దాదాపు సభ్యులంతా వినతిపత్రం ఇచ్చారు. దీనితో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, కమిషనర్ నరేంద్రకుమార్ విజిలెన్స్ విచారణకు చర్యలు తీసుకుంటామన్నారు.

పునుకొల్లు మాజీ సర్పంచ్‌కు మాతృ వియోగం



దండమూడి సత్యలత

పెదపాడు, సెప్టెంబరు 30: పునుకొల్లు మాజీ సర్పంచ్, టీడీపీ నాయకులు దండమూడి సీతారామప్రసాద్ తల్లి దండమూడి సత్యలత (80) సోమవారం మృతి చెందారు. ఆమె భర్త దండమూడి నాగేశ్వరావు పెదపాడు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేశారు. సత్యలత నేత్రాలను దానం చేయడంతో ఎల్‌వీప్రసాద్ కంటి వైద్య సిబ్బంది పునుకొల్లు గ్రామంలో సత్యలత కార్నియా సేకరించారు. మాజీ సర్పంచ్ సీతారామప్రసాద్ కుటుంబ సభ్యులకు పలువురు సంతాపం తెలిపారు.

జడ్పీ మాజీ చైర్మన్ బాపిరాజుకు పరామర్శ



బాపిరాజును పరామర్శిస్తున్న నాయకులు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 30: జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు తండ్రి వెంకటరత్నం ఇటీవల మృతిచెందారు. మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ నాయకులు తూంపాటి పద్మ వర ప్రసాద్, మల్లిపెద్ది బాబు రాజేంద్రప్రసాద్ తదితరులు బాపిరాజును పరామర్శించారు.

రేపు స్వచ్ఛభారత్ దివస్ వేడుకలు : ఎంపీ మహేశ్

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 30: జాతిపిత మహాత్మగాంధీ జయంతి అక్టోబర్ 2న స్వచ్ఛభారత్ దివస్ వేడుకలు జరుపుకుందామని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా స్వచ్ఛభారత్ దివస్‌ను పాటిస్తున్నారన్నారు. ఈ వేడుకలు దేశానికి ఒక మైలురాయిగా నిలుస్తాయన్నారు. ప్రధాని నరేంద్రమోదీ స్వచ్ఛభారత్ మిషన్‌ను ప్రారంభించి పదేళ్ల పూర్తయిన సందర్భంగా ఈ వేడుకలకు ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా తాగునీరు, పారిశుధ్యశాఖ, గృహనిర్మాణ శాఖ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని అన్నారు. దేశవ్యాప్తంగా 11.77 లక్షలకు పైగా కార్యక్రమాలు నిర్వహించి 8కోట్ల మంది పౌరులను భాగస్వాములను చేస్తామన్నారు. వేడుకల్లో భాగంగా శ్రమధాన కార్యక్రమాలు నిర్వహించడం స్వచ్ఛసంకల్ప ర్యాలీలు నిర్వహించటం బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన నిషేధించడం, మరుగుదొడ్లు నిర్మించే కార్యక్రమం చేపడతామన్నారు.

అంగన్వాడీల్లో గర్భిణులకు సామూహిక సీమంతం

భీమడోలు, సెప్టెంబర్ 30: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా భీమడోలు సెక్టార్ పరిధిలోని అర్జావారిగూడెం కమ్యూనిటీ హాలులో సామూహిక సీమంతాలు నిర్వహించారు. పౌష్టికాహార మాసోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా మిషన్‌శక్తి వంద రోజుల అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణీలకు సామూహిక సీమంతాలను నిర్వహించి సత్కరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షహనాజ్‌బేగమ్, ఎఎన్ఎం వెంకట లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● కుక్కునూరు: తొండిపాక సచివాలయం పరిధిలో సోమవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. తొండిపాక, బంజరగూడెం, మిట్టగూడెం, పొత్తూరురామాపురం, అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించటంతో పాటు పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్ రుక్మిణి, సర్పంచ్ జీ.రాజేశ్వరి, టీడీపీ నాయకులు కేవీఆర్, వెంకటరమణ, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** ఖురాన్ కంఠస్థ ప్రతిభా పోటీలకు మూడేళ్ల నుంచి 12ఏళ్ళలోపు విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని యునైటెడ్ ఫోరం ఫర్ ఖురామిక్ స్టడీస్ రీజనల్ కోఆర్డినేటర్ మహ్మద్‌నయిముల్లా తెలిపారు. వివరాలకు 9989380350 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.
- **ఏలూరు క్రైం :** ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న బి నాగేశ్వరరావు, ఏఆర్ ఎస్ఐగా కె ఎబినైజర్, ఎస్ఐ రాధాకృష్ణ (క్లూస్ టీమ్), ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ బి ఆనంద్‌కుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సత్కరించి వీడ్కోలు నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఎఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐ భాస్కరరావు, నాగేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.
- **కామవరపుకోట :** తడికలపూడి జడ్పీ, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జనసేన నాయకులు కంచాలు అందజేశారు. షేక్ వలీ, తోటకూర మాణిక్యాలరావు, మోటేపల్లి రామకృష్ణ, సింగవరపు హరీష్, ఈడ నాగు, కొనసం బాబు, యర్రోజు శివాజీ, కొండపల్లి నవీన్, సత్యనారాయణ, గొంతు వెంకటేశ్వరరావు, తూతా లక్ష్మణరావు, నాగేశ్వరరావు, మేరుగు సుందరరావు, మొట్టికాయల నాగేశ్వరరావు, చౌటపల్లి నాగరాజు పాల్గొన్నారు.
- కొండగూడెంలోని సిఎస్ఐ చర్చిలో పాస్టర్ కె జాన్‌రాజు, పందు జగదీష్ బృదం వృద్ధులకు దుప్పట్లు, చీరలు, పండ్లు, తదితర వస్తువులను అందజేశారు.
- **పెదవేగి :** పెదవేగిలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా ఉపకేంద్రం పరిధిలలోని పెదవేగి, గార్లమడుగు, సూర్యారావుపేట, కవ్వగుంట, లక్ష్మీపురం, దిబ్బగూడెం గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఏలూరు ఈఈ కేఎం.అంబేడ్కర్ తెలిపారు.
- **చింతలపూడి :** వెంకటాపురం పంచాయతీలో సమస్యలు పరిష్కరించాలని మాజీ సర్పంచ్ ఆది సత్యనారాయణ కోరారు. అధికారులు దీనిపై దృష్టిపెట్టి సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. ఎస్సీ ఏరియాలో కమ్యూనిటీ హాలు నిర్మించాలన్నారు.
- **ఉంగుటూరు :** యూటీఎఫ్.ఆధ్వర్యంలో జరిగిన జానపద కళాకారుల పోటీలలో అల్లు శ్రీనివాస్, ఆకివీడు వాణి, హరికృష్ణ, శివ, పద్మ, రాణి, అల్లు శ్రీను, హరికృష్ణ, జానపద నృత్యంలో హరికృష్ణ, కె.ఋలి వెంకయ్య, హరికృష్ణ తదితరులు గెలుపొందారు.
- ఉంగుటూరు మండలం నారాయణపురం సొసైటీ లాభాల బాటలో నడుస్తున్నదని పర్సన్ ఇన్‌చార్జి కురిచేటి నరసింహమూర్తి తెలిపారు. చేబ్రోలు సొసైటీ (నారాయణపురం)లో మహా జనసభ నిర్వహించారు. కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.
- **పోలవరం :** మండలంలో ధాన్యం కొనుగోలు విధానంపై ఏవో కె.రాంబాబు ఆధ్వర్యంలో సివిల్ సప్లైస్ శాఖ సిబ్బంది మండల ధాన్యం కొనుగోలు సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సివిల్ సప్లైస్ టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు అవగాహన కల్పించారు.
- పోలవరం మండల కేంద్రంలో స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో ఉన్న బస్ షెల్టర్ వద్ద మరుగుదొడ్లు నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు కోరారు. ప్రజా సమస్యల పరిష్కార గ్రీవెన్స్‌లో ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు.


గోతులతో కలిదిండి - కోరుకొల్లు రాష్ట్ర రహదారి


తటి అరని అగిరిపల్లిలో గన్నవరం రహదారి


ముదినేపల్లిలో బురదమయంగా పంచాయతీ కార్యాలయ రహదారి

నరక దారులు

మరమ్మతులకు ప్రజల ఎదురుచూపు

రహదారులు ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. వైసీపీ హయాంలో అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా మారిన రహదారులు ఇటీవలి వర్షాలకు మరింత ఛిద్రమయ్యాయి. ఇక వాహనచోదకుల పాట్లు చెప్పక్కర లేదు. పలువురు గోతుల్లో పడి ఆస్పత్రి పాలవుతున్నారు. అధికారులు తక్షణం స్పందించి దెబ్బతిన్న రహదారులపై దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కలిదిండి, సెప్టెంబరు 30 : కలిదిండి-కోరుకొల్లు రాష్ట్ర రహదారి అధ్వానంగా మారింది. ద్విచక్ర వాహన చోదకులు గోతుల్లో పడి క్షతగాత్రులవుతున్నారు. కొద్దిపాటి వర్షానికే గోతుల్లో నీరు ఉండటంతో చెరువులను తలపిస్తున్నాయి. కలిదిండి నుంచి కోరుకొల్లు వరకు 7 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారిపై పెద్ద గోతులు పడటంతో ఆర్టీసీ బస్సుల కమాన్ కట్టలు విరిగిపోతున్నాయి. నిత్యం ఈ రహదారిపై హైదరాబాద్, విజయవాడ, గుడివాడ, భీమవరం ఎక్స్‌ప్రెస్‌లు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి అధ్వానంగా ఉండటంతో పలు బస్సులను రద్దు చేస్తామని ఆర్టీసీ అధికారులు హుకూం జారీ చేశారు. ఈ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే కలిదిండి - కోరుకొల్లు రాష్ట్ర రహదారి మరమ్మతులు చేపట్టాలని, ఐదేళ్లుగా పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కలిదిండి - కోరుకొల్లు రాష్ట్ర రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారిపైకే మురుగునీరు..

అగిరిపల్లి: వర్షాలు కురిసి నాలుగు రోజులైనా అగిరిపల్లిలోని గన్నవరం రోడ్డు చెరువును తలపిస్తోంది. పెద్దకొటాయి సెంటర్ నుంచి జూనియర్ కాలేజీ వరకు గుంతలమయమై నడవడానికి కూడా ఇబ్బందికరంగా మారింది. డ్రెయినేజీ సదుపాయం లేక స్థానికుల ఇళ్లలోని నీరు రోడ్డుపైకి వదిలేస్తుండటంతో దుర్గంధం వ్యాపిస్తోంది. పంచాయతీ వారు కూడా చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పంచాయతీ కార్యాలయానికి వెళ్లేదెలా..?

ముదినేపల్లి: ముదినేపల్లిలో పంచాయతీ కార్యాలయానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. వర్షపు నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి నుంచి సుమారు 400 మీటర్లు ఉన్న ఈ రహదారిని అభివృద్ధి చేసేందుకు ఏళ్ల తరబడి ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు. గ్రామ ప్రజలకు పంచాయతీ కార్యాలయానికి వెళ్లేందుకు ఇదొక్కటే రహదారి. తరచూ అధికారులు ఈ కార్యాలయానికి వస్తూనే ఉంటారు. అయినా ఏ అధికారి రోడ్డు దుస్థితిని పట్టించుకున్న దాఖలాలు లేవు. రహదారిపై వర్షపు నీరు నిలిచి బురదమయం కావటంతో వాహనదారులు పక్కనే జాతీయ రహదారి అధికారులు నిర్మించిన పక్కా డ్రైన్‌పై అమర్చిన సిమెంట్ ప్లేట్లపై నుంచి వెళ్తున్నారు. ఆ రహదారిలో ఎన్నో వాణిజ్య సముదాయాలు కూడా ఉండటంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం గోతులైనా పూడ్చించి నడిచేందుకైనా అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

శ్రీశ్యామలాంబ ఆలయ ఉత్సవ కమిటీ ఏర్పాటు

కైకలూరు, సెప్టెంబరు 30: కైకలూరు శ్రీ శ్యామలాంబ అమ్మవారి చండీమహా యాగ సహిత శరన్నవరాత్రి ఉత్సవాలకు ఉత్సవ కమిటీ సభ్యులను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారి వీఎన్‌కె శేఖర్ తెలిపారు. ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నామని ప్రతి రోజూ వివిధ అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని ఈ ఉత్సవాలను పటిష్ఠంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ పనిచేస్తుందన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా పంద్రంగి కనక దుర్గాప్రసాద్, వేములపల్లి కారుణ్య, ఆచంట బలరామకృష్ణ, బొగ్గవరపు శ్యాంప్రసాద్, సింహాద్రి రాంబాబు, లక్కింశెట్టి మోహనరావు, బొక్కా వెంకట్రావు, కటికన రాఘవరావు, దైతగుంజ రామస్వామి, చావలి శంకరశాస్త్రిని నియమించినట్లు తెలిపారు.

ఇరు వర్గాల మధ్య దారి వివాదం..

ఫెన్సింగ్ వేయడంతో ఒక వర్గం పాట్లు

చాట్రాయి, సెప్టెంబరు 30: మండలంలోని కోటపాడు గ్రామంలో రెండు కుటుంబాల మధ్య వివాదం కారణంగా, దారికి అడ్డుగా ఫెన్సింగ్ వేయటంతో ఒక వర్గానికి చెందిన బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. కోటపాడులో ఓ వీధిలో దారికి ఒకవైపు చీపు ధర్మారావు, చీపు నాగరాజు, చీపు వెంకటేశ్వరరావు కుటుంబాలు, మరోవైపు వేముల నాగేశ్వరరావు, వేముల రామారావు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ కుటుంబాలు తమ ఇళ్ళ ఎదురుగా ఉన్న దారి నుంచి సుమారు 50 ఏళ్ళ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. సదరు దారి స్థలం తమదంటే తమదని కొన్నేళ్ళ నుంచి చీపు, వేముల కుటుంబాల వారు గొడవలు పడుతూ పోలీస్‌స్టేషన్‌లో కేసులు కూడా పెట్టుకున్నారు. వేముల కుటుంబం టీడీపీకి చెందిన వారు కాగా, చీపు కుటుంబం వైసీపీ మద్దతుదారులుగా ఉన్నారు. దారి విషయంలో తమను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని ఈ రెండు కుటుంబాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. వేముల నాగేశ్వరరావు అర్జీ మేరకు 5 రోజుల క్రితం మండల సర్వేయర్ వచ్చి భూమి కొలిచి సరిహద్దు రాళ్ళు వేసివెళ్ళారు. దీంతో వేముల నాగేశ్వరరావు సర్వే ప్రకారం ఫెన్సింగ్ వేయటంతో చీపు కుటుంబాలకు ఇళ్ళ నుంచి బయటకు రాకుండా దారి మూసుకుపోయింది. దారి స్థలం హక్కుదారులమైన తమని వైసీపీ ప్రభుత్వంలో చీపు కుటుంబం తీవ్ర ఇబ్బందులు పెట్టిందని, సర్వేయర్ నిర్ణయించిన హద్దుల ప్రకారం ఫెన్సింగ్ వేసుకున్నామని వేముల నాగేశ్వరరావు అంటున్నారు. గత 5 రోజులుగా ఇంటి నుంచి బయటకు వెళ్లలేకపోతున్నామని, పిల్లలు స్కూల్స్ వెళ్ళటం లేదని, అధికారులు తమకు న్యాయం చెయ్యాలని బాధితులు కోరుతున్నారు.

రాజకీయ గొడవలే కారణం: తహసీల్దార్

కోటపాడులో దారికి అడ్డుగా ఫెన్సింగ్ వేయటానికి రాజకీయ గొడవలే కారణమని తహసీల్దార్ ప్రశాంతి అన్నారు. సర్వే కోసం చలానా కట్టి అర్జీ పెట్టుకుంటే సర్వేయర్ వెళ్ళి సరిహద్దులు చూపించి వచ్చారు. రాజకీయాలు పక్కన పెట్టి వివాదాన్ని పరిష్కరించుకోవాలని ఇరువర్గాలను కోరుతున్నాం.

విద్యార్థి మృతదేహం లభ్యం


మృతుడి తల్లిదండ్రులను ఓదార్చుతున్న బలే ఏసురాజు

కైకలూరు, సెప్టెంబర్ 30: కొల్లేరు సర్కారు కాలువలో దూకిన పదో తరగతి విద్యార్థి పేడాడ పోలినాయుడు (16) మృతదేహం లభించింది. సోమవారం ఉదయం మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టగా వంతెనకు 100 మీటర్ల దూరంలోనే చేపల వేట కోసం అడ్డుకట్టిన వలలకు చిక్కుకున్నాడు. గజ ఈతగాళ్ళ సహాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. ఏలూరులోని కొత్తూరు ఇందిరా కాలనీకి చెందిన పేడాడ రామకృష్ణారావు కుటుంబంతో కలిసి ఆదివారం కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఆలయానికి వచ్చిన సందర్భంలో కుమారుడు పోలినాయుడు వంతెనపై నుంచి దూకేశాడు. కుమారుడి మృతదేహం లభించిన చోట తల్లిదండ్రులు రోదనలు కొల్లేటిప్రజలను కంటతడిపెట్టించాయి. రాష్ట్ర వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు మృతుడి తల్లిదండ్రులను ఓదార్చారు. కైకలూరు రూరల్ ఎస్సై రాంబాబు బాలుడి మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి అనంతరం విద్యార్థి కుటుంబీకులకు అప్పగించారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

ముదినేపల్లి, సెప్టెంబరు 30: బొమ్మినంపాడు శివారు జానకిగూడేనికి చెందిన భూపతి సత్యనారాయణరాజు (60) దేవపూడిలో రొయ్యల చెరువు లీజుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. సోమవారం చెరువు గట్టుపైకి వెళ్లి విద్యుత్ మోటార్ స్విచ్ ఆన్ చేయగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లేలోగానే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్‌ఐ వెంకట్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. గతంలో మృతుడి కుమారుడు సందీప్ కూడా రెండేళ్ల క్రితం అదే చెరువుపై విద్యుదాఘాతానికి గురై మరణించాడు. సత్యనారాయణరాజుకు భార్య, కుమార్తె ఉన్నారు.

రైతుకు పాము కాటు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 30: పాము కాటు వేయడంతో రైతు అస్వస్థతకు గురైన ఘటన సుంకొల్లులో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీనివాసరావు వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లగా గడ్డిలో ఉన్న పాము కాటు వేసింది. సమీప రైతులు అతనిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్య సేవలందిస్తున్నారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 30: నూజివీడు గాంధీనగర్‌కు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి కుటుంబ కలహాల నేపథ్యంలో ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబీకులు అతనిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సన్మాన సభలో మాట్లాడుతున్న దేశిరెడ్డి


ఎంపీడీవో విజయకుమార్‌కు సత్కారం


ముదినేపల్లిలో ఉపాధ్యాయినికి సత్కారం

ఉత్తమ సేవలతో మన్ననలు

చాట్రాయి, సెప్టెంబరు 30: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, టీడీపీ నాయకులు మందపాటి బసవారెడ్డి, బొట్టు లక్ష్మణరావు అన్నారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ చేసిన ఎంపీడీవో కె దుర్గాప్రసాద్ దంపతులను, స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన ఈవోపీఆర్డీ పి మురళీకృష్ణ దంపతులను, బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శులు నిషాక్ అలీ, లక్ష్మీనారాయణలను సత్కరించారు. మండల స్పెషలాఫీసర్ వెంకటరత్నం, ఎంపీపీ నిర్మల, వైస్ ఎంపీపీలు సుబ్బారెడ్డి, జగన్మోహనరావు, ఎంఈవో బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: నూజివీడు ఎంపీడీవో విజయ్‌కుమార్ సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో నూజివీడు ఎంపీపీ అరేపల్లి శిరీష కృష్ణా జడ్పీ వైస్ చైర్మన్ గుడిమెళ్ల కృష్ణంరాజు ఆయనను సత్కరించారు. మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. నూజివీడు సబ్ రిజిస్ట్రార్ తులసిరత్నం సోమవారం పదవీ విరమణ చేశారు. డాక్యుమెంట్ రైటర్లు, సిబ్బంది ఆమెను సత్కరించారు.

ముదినేపల్లి: టీచర్‌గా 40 ఏళ్ల పాటు పలు పాఠశాలల్లో పనిచేసి సోమవారం ఉద్యోగ విరమణ చేసిన ముదినేపల్లి జడ్పీ హైస్కూల్ సోషల్ టీచరు ఎ.కె.రెజీనాను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం విజయకుమార్ ఆధ్వర్యంలో స్టాఫ్ సెక్రటరీ సత్యనారాయణ, వడాలి హెచ్‌ఎం వి.ప్రభుదాసు, హైస్కూల్ ఉపాధ్యాయులు, పీఈటీలు, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్ తదితరులు సత్కరించారు. ఆమె తన సర్వీసులో పలు అవార్డులు అందుకుని ఉత్తమ విద్యాబోధనతో విద్యాశాఖ అధికారుల ప్రశంసలు అందుకున్నారని పలువురు పేర్కొన్నారు.

భైరవపట్నంలో 'ఇది మంచి ప్రభుత్వం'



మండవల్లి, సెప్టెంబరు 30: మండవల్లి మండలం భైరవపట్నంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా భైరవపట్నం గ్రామంలో ఎన్డీయే నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజుల్లో చేపట్టిన అభివృద్ధి, మంచి పనులను వివరించారు. పోలవరం నిర్మాణానికి 16వేలకోట్లు, అన్నా క్యాంటీన్లు, పింఛన్ల పెంపు, రాజధాని నిర్మాణంకు అడుగులు, డీఎస్సీ ప్రకటన చేసి నిరుద్యోగుల్లో ఉత్సాహాన్ని లేపిన ఘనత ఎన్డీయే ప్రభుత్వం దీనిని వివరించారు. ఎన్డీయే నాయకులు సబ్బా సురేష్‌బాబు, సర్పంచ్ రాధా నాగేంద్ర, గుంటూరు సత్యనారాయణ, దాసుబోయిన రమేష్, కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులనే విక్రయించాలి

ముసునూరు, సెప్టెంబరు 30: రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను మాత్రమే దుకాణదారులు అమ్మాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.మధుమోహన్ అన్నారు. సోమవారం చెక్కపల్లిలో మన గ్రోమోర్ సెంటర్‌లో నాణ్యత పరీక్షల నిమిత్తం మూడు ఎరువుల నమూనాలను ఏవో సేకరించారు. అనంతరం ఎరువుల స్టాక్‌ను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలలో ఏదైనా వ్యత్యాసం గుర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పురుగుమందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా బిల్లును రైతులు అడిగి తీసుకోవాలని, పంటకాలం పూర్తయ్యేవరకు వాటిని భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. వీహెచ్‌ఏలు ఆర్.శ్రీనివాసరావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుడి ఉపవాస దీక్ష



కైకలూరు, సెప్టెంబరు 30: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం అపవిత్రతపై అటపాకకు చెందిన జనసేన నాయకుడు కడిమి శివ బాబు సోమవారం కైకలూరు వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఉపవాస దీక్ష చేపట్టారు. సాయంత్రం వరకు దీక్షను చేపట్టి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ దీక్షకు పార్టీ నాయకులు కొల్లి వరప్రసాద్, నల్లగోపుల చలపతి, వీరంకి వెంకయ్య, జడ్డు సుబ్రహ్మణ్యం, కాళ్ళపాలెం బుజ్జి, చిట్టూరి రవీంద్ర, మౌళి, తదితరులు సంఘీభావం తెలిపారు.

పవన్ దీక్షకు మద్దతుగా లక్ష దీపారాధన

మండవల్లి, సెప్టెంబరు 30: శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వివాదంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా జనసేన ఆధ్వర్యంలో మండవల్లిలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం లక్ష దీపారాధన నిర్వహించారు. మండవల్లి మండల జనసేన నాయకులు టి. రవితేజ, పసుపులేటి నాం చారయ్య భట్రాజు ఫణీంద్ర, నందకిషోర్, ఉమాకాంత్, శశి శర్మ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుల పూజలు

కలిదిండి, సెప్టెంబరు 30: తిరుమల లడ్డూ అపవిత్రతపై జనసేన నాయకులు సోమవారం సానారుద్రవరం రామాలయంలో లక్ష వత్తులు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. జనసేన నాయకులు నల్లగోపుల చలపతిరావు, పన్నాసు పూర్ణచంద్రరావు, ఉద్దరాజు సుభాషిణి, సానా సరస్వతి, జడ్డు సుబ్రహ్మణ్యం, పేపకాయల మౌళి, స్వాతి, కుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

బాలుర వసతి గృహం తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న న్యాయసేవాధికారిణి లక్ష్మి

కైకలూరు, సెప్టెంబర్ 30: వసతి గృహ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని వసతులను అందించాలని కైకలూరు సీనియర్ న్యాయ సేవాధికారిణి వీవీఎస్‌వీ లక్ష్మి అన్నారు. కైకలూరు బీసీ బాలుర వసతి గృహాన్ని సోమవారం సాయంత్రం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలను తెలుసుకున్నారు. అలాగే మంచినీరు, బెడ్స్ తదితర వసతులపై ఆరా తీశారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరి స్తామని సూచించారు. న్యాయవాది ఎంఎస్ఎస్ రాజు, వార్డెన్ బి. నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పాతూరి రంగారావు విగ్రహావిష్కరణ



ముదినేపల్లి, సెప్టెంబరు 30 : సమాజంలో అన్ని వర్గాల ఆదరాభిమానాలు పొందిన వారే ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా ఉంటారని మాజీ విద్యా శాఖ మంత్రి, టీడీపీ నాయకుడు పిన్నమనేని వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని చేవూరులో ఏర్పాటు చేసిన ఆ గ్రామ మాజీ సర్పంచ్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు పాతూరి రంగారావు (రాజా) విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరిం మాట్లాడుతూ రాజా అందరివాడుగా ప్రజల అభిమానాన్ని పొందారన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్, టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, మాజీ జడ్పీటీసీ పాతూరి సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సహకారంతో పూడికతీత

ముసునూరు, సెప్టెంబరు 30: రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి సహకారంతో వలసపల్లి పంచాయతీలో డ్రెయినేజీ పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ చలసాని దామోదరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మేదరమెట్ల సురేంద్ర మాట్లాడుతూ గ్రామంలో డ్రెయినేజీల్లో పేరుకుపోయిన సిల్ట్, పూడిక తొలగించే ఎక్స్‌కవేటర్ ఖర్చు తానే భరిస్తానని మంత్రి చెప్పినట్లు వివరించారు. పూడిక మట్టి తరలింపు ఖర్చును పంచాయతీ భరిస్తుందని సర్పంచ్ చెప్పారు. పంచాచయతీ ఆర్థిక పరిస్థితి, డ్రెయినేజీల సమస్య చెప్పిన వెంటనే మంత్రి స్పందించి, ఎక్స్‌కవేటర్‌ను పంపడం పట్ల స్థానికులు మంత్రి సారథిని అభినందించారు. కార్యదర్శి పామర్తి వెంకట వీర్రాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కలపాల అంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

ముంపు నీటి మళ్లింపు



మండవల్లి, సెప్టెంబరు 30: మండవల్లిలోని రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకి పల్లపు ప్రాంతాలు ముంపు గురయ్యాయి. రహదారులు ముంపు నీటిలో అధ్వానంగా మారాయి. దీనిపై స్పందించిన సర్పంచ్ మెండా ఝాన్సీ సోమవారం మోటార్లు ఏర్పాటుచేసి ముంపు నీటిని తరలించారు. కూలీలతో కచ్చా డ్రైన్ తవ్వకం పనులను చేపట్టారు. పనుల నిర్వహణను సర్పంచ్ మెండా ఝాన్సీ సోమవారం పరిశీలించారు.

8 అర్జీల స్వీకారం: ఆర్డీవో

నూజివీడు టౌన్, సెప్టెంబరు 30: నూజివీడు డివిజన్ పరిధిలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 8 అర్జీలు అందినట్టు ఆర్డీవో భవానీ శంకరి తెలిపారు. వీటిలో పంచాయతీరాజ్‌కు సంబంధించి 2, పోలీస్ స్టేషన్లకు సంబంధించి ఒకటి, మున్సిపల్ పరిధిలో రెండు, ఇతర అంశాలకు చెందినవి 3 దాఖలు అయినట్లు వాటిని ఆయా శాఖలకు బదిలీ చేసి సత్వరం పరిష్కరించాలని ఆదేశించినట్లు ఆర్డీవో తెలిపారు.

వీఆర్వోను బదిలీ చేయండి

కలిదిండి, సెప్టెంబరు 30: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామకృష్ణ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో భూ సమస్యలపై 5 అర్జీలు, సంతోషపురం వీఆర్వోను బదిలీ చేయాలని గ్రామస్థులు ఒక అర్జీని సమర్పించారన్నారు.

పంట నష్ట పరిహారం జమ

కలిదిండి, సెప్టెంబరు 30 : మండలంలో భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతుల ఖాతాలో నష్టపరిహారం జమ చేయటం జరిగిందని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ తెలిపారు. మొత్తం 109 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందన్నారు. ఎకరానికి రూ.10 వేలు చొప్పున పంట నష్టపరిహారం 115 మంది రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు.

బాలల హక్కులపై అవగాహన పెంచుకోవాలి



ఆగిరిపల్లి, సెప్టెంబరు 30: బాలల హక్కులపై అవగాహన పెంచుకుని వారి సమగ్ర అభివృద్ధికి పునరంకితమవ్వాలని బాలల హక్కుల కార్యకర్త గోడే ప్రసాద్ అన్నారు. మండలంలోని తోటపల్లిలో గల హీల్ పారడైజ్ చిల్డ్రన్ హోమ్‌లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. బాలల హక్కులను గౌరవించి వారిలో ఆత్మవిశ్వాసం పెంచి, ఆదరించి విలువలు కలిగిన బావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. హీల్ కార్యదర్శి లక్ష్మి, సీఈవో అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లో 'భోజన' పథకం అమలుచేయాలి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 30: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని నూజివీడు బాలికోన్నత పాఠశాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర కోశాధికారి రాజకుమార్, సమాఖ్య ఏలూరు జిల్లా కన్వీనర్ శివకుమార్, నాయకులు లాగు ఆకాష్, మల్లాది ఆకాష్, రాజ్యలక్ష్మి, లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 ఏపీ క్రికెట్ టీంకు ఎన్ఆర్ఐ విద్యార్థి


సాయి ప్రకాష్

ఆగిరిపల్లి, సెప్టెంబరు 30: ఆగిరిపల్లి ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థి తాతా సాయి ప్రకాష్ అండర్-19 ఏపీ క్రికెట్ టీంకు ఎంపికయ్యాడు. ఈ టీమ్ అక్టోబరు 4న పంజాబ్‌లో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుంది. ఎంపికైన ప్రకాష్‌ను కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్. వెంకట్రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాగభాస్కర్ తదితరులు అభినందించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి. గౌతు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాట్రాయి, సెప్టెంబరు 30: మండలంలోని పోలవరం, చీపురుగూడెం సబ్‌స్టేషన్ల పరిధిలో 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మత్తుల దృష్ట్యా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సంజయ్ తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

సబ్సిడీ దాణాను సద్వినియోగం చేసుకోవాలి



నూజివీడు టౌన్, సెప్టెంబరు 30: రాష్ట్ర ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్న దాణాను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని బత్తులవారిగూడెం సర్పంచ్ ముసునూరి లక్ష్మీకాంతమ్మ కోరారు. నూజివీడు మండలం యనమదల పశు వైద్యశాల పరిధిలో పాడి రైతులకు 25 మెట్రిక్ టన్నుల సంపూర్ణ మిశ్రమ దాణాను సరఫరా చేయగా ఆమె రైతులకు పంపిణీ చేశారు. రావిచర్ల, దిగవల్లి, హనుమంతులగూడెం, ముక్కొల్లుపాడు గ్రామాల్లోని పాడి రైతులకు రూ.15.50 దాణాను రాష్ట్ర ప్రభుత్వం రూ.6.50లకు సరఫరా చేస్తుందన్నారు. యనమదల పశువైద్యాధికారి డాక్టర్ అభిలాష్, మండల టీడీపీ అధ్యక్షుడు ముసునూరు రాజా, పర్వతనేని సాయి, వెంకట రామిరెడ్డి, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంఘం రిజిస్ట్రేషన్‌కు వినతి



ముసునూరు, సెప్టెంబరు 30: ముసునూరులో చేపల వేటతో జీవనం సాగిస్తున్న మత్స్యకారులు ఏర్పాటు చేసుకున్న నూతన సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయాలని మత్స్యశాఖ జిల్లా ఏడీఏ రాజ్‌కుమార్‌కు సోమవారం రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు వినతిపత్రం అందజేసి మాట్లాడుతూ గత 15 ఏళ్ళ నుంచి బడుగు బలహీన వర్గాలకు చెందిన 32 మంది మత్స్యకారులు స్థానిక నల్లచెరువు, దేవర చెరువుల్లో చేపలు వేట చేస్తూ జీవనం సాగిస్తున్నారని, వీరి సంఘ రిజిస్ట్రేషన్‌ను తక్షణమే చేయాలన్నారు. సంఘం అధ్యక్షుడు చెంగల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చట్టాలపై బాలికలు అవగాహన కలిగి ఉండాలి

ముసునూరు, సెప్టెంబ రు 30: బాలికలు చట్టాల పై అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జ్ ఎస్ఐ కె.రాజారెడ్డి అన్నారు. సోమవారం ముసునూరు ఎస్సీ హాస్టల్‌లో బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఇబ్బంది పెడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పోక్సో చట్టంపై బాలికలకు వివరించారు. ఏ సమస్య వచ్చినా 112, 100 నంబర్లుకు కాల్ చేయాలని సూచించారు. వార్డెన్ హిమబిందు, ఏఎన్ఎం పావ, మహిళా పోలీసులు సంధ్యారాణి, భవాని పాల్గొన్నారు.

తాడినాడ జడ్పీ విద్యార్థులకు బహుమతులు

కలిదిండి, సెప్టెంబరు 30 : కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విభాగంలో జరిగిన పోటీలలో తాడినాడ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు మూడు బహుమతులు సాధించారని ప్రధానోపాధ్యాయురాలు డి.ఉమాదేవి తెలిపారు. క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు వెంకటరెడ్డి, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు నాగ రాజు విజేతలను అభినందించారు.

ఠారెత్తించిన ఎండ

కలిదిండి, సెప్టెంబరు 30 : కలిదిండిలో సోమవారం ఎండ ఠారెత్తించింది. ఉదయం 10 గంటల నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావటంతో వేసవిని తలపించింది. ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు.

ఆఖరి మజిలీ.. ఆనందంగా..

ప్రేమానుబంధాలతోనే వృద్ధాప్యంలో ఆరోగ్యం

అరవై ఏళ్ల వయసంటేనే భయపడే పరిస్థితుల నుంచి ఇప్పుడు కొంచెం బయటపడుతున్నారు. ఇప్పుడు మనిషి సగటు ఆయుర్దాయం 68 ఏళ్లకు పెరిగింది. వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలంటే పరిస్థితులను తమకు అనుకూలంగా మలచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వయసులో తమ శక్తియుక్తులన్నింటినీ పిల్లల ఎదుగుదలకు, అభివృద్ధికి వెచ్చించిన అమ్మా,నాన్నలను చివరిలో పిల్లలు ప్రేమతో చూసుకోవాలి. అప్పుడే వృద్ధాప్యం శాపంగా మారదు. నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..



\- పాలకొల్లు

ఆరేళ్ల పసిపిల్లలు తల్లిదండ్రులను విడిచి ఎలా ఉండలేరో 60 ఏళ్లు దాటిన తల్లిదండ్రులు పిల్లల ఆసరా లేకుండా ఉండలేరనేది సత్యం. అయితే ఇప్పుడు వృద్ధులకు పిల్లల ఆసరా కరువైపోతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ జరిపిన సర్వేలో అధికశాతం వృద్ధులు చరమాంకంలో వివిధ అనారోగ్య, మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు వెల్లడైంది. అనారోగ్యంతో గడుపుతున్న వారి సంఖ్య 20 శాతం ఉండగా, సుమారు 15 శాతం వృద్ధులు మానసిక ఒత్తిడితో జీవిస్తున్నారు. 20 శాతం మంది అనారోగ్య సమస్యలతో, సుమారు 10 శాతం వృద్ధులు బిడ్డల సంరక్షణకు దూరమై కాయకష్టంతోనూ లేదా వృద్ధాశ్రమాల్లో జీవిస్తున్నారు. 30 శాతం పైబడి వృద్ధులు మానసిక, ఆర్థిక సమస్యలతో కాలం వెళ్లదీస్తున్నారు.

పెరుగుతున్న ప్రాణభయం

సహజంగానే వృద్ధాప్యంలో ప్రాణభయం పెరుగుతూ వస్తుంది. ఇప్పుడు అరవై ఏళ్ల వయసులో మనోధైర్యంతో ఉంటున్నప్పటికీ 65-70 ఏళ్లు వచ్చేసరికి ప్రాణభయం వెంటాడుతోంది. ఈ భయాన్ని జయించడానికి ఆ వయస్సులో పిల్లల ఆప్యాయతానురాగాలే వృద్ధులకు వరం అని చెప్పవచ్చు. పట్టణవాసం, నగరీకరణ పెరుగుతున్న నేపథ్యంలో ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోతున్నాయి. వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడే తీరిక యువతకు దొరకడం లేదు. వృద్ధులను ఆప్యాయంగా చూసుకుంటున్న కుటుంబాల్లో వృద్ధుల ఆయుర్దాయం పెరుగుతుందని సర్వేలు వెల్లడిస్తున్నాయి.

చాదస్తంతో ఇబ్బందులు

వయసుపైబడి బాధ్యతలను బిడ్డలకు అప్పగించి కృష్ణా.. రామా.. అంటూ కాలం వెళ్లదీసే వృద్ధాప్యాన్ని ఇప్పుడు ధిక్కార స్వరాలు కుంగదీస్తున్నాయి. సంపాదనలో ఉన్నప్పుడు ఇంటిలో వారిని శాసించిన కుటుంబ పెద్ద వృద్ధాప్యం వచ్చేసరికి ధిక్కార స్వరానికి గురవుతున్నారు. 65 ఏళ్ల పైబడిన వృద్ధుల్లో సహజంగా చాదస్తం పెరుగుతుంది. చెప్పిందే చెబుతుండటం, చేసిందే చేయడం చేస్తుంటారు. అయితే ఈ విధానాలను పిల్లలు తప్పు పట్టకుండా ఒక్కసారి తమ బాల్యాన్ని గుర్తుచేసుకోవాలి. చిన్నతనంలో చెప్పిందే చెప్పి, అడిగిందే అడిగి తల్లిదండ్రులను విసిగిస్తారు. అయినప్పటికీ తల్లిదండ్రులు ఓర్పుతో సమాధానం చెబుతారు. అదేవిధంగా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చిన్న పిల్లలుగా భావిస్తే ఇబ్బందే ఉండదు. ఉద్యోగం లేదా వ్యాపారాలతో బిజీగా ఉన్నప్పటికీ రోజుకు కనీసం ఒక గంట గృహ సంబంధాలకు విలువ ఇవ్వాలని సూచిస్తున్నారు. ఆప్యాయంగా అమ్మా.. నాన్నా.. అని పిలిచే పలకరింపులే వారికి ఆనందాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తున్నాయి.

చాలినంత సమయం నిద్రపోవాలి

వృద్ధాప్యంలో ప్రశాంతమైన నిద్ర ఒక వరం. అయితే అధిక శాతం వృద్ధులకు నిద్ర కరువవుతూ ఉంటుంది. రోజుకు 8 గంటలకు తక్కువ కాకుండా నిద్రిస్తే ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. వివిధ అనారోగ్యాల నుంచి తప్పించు కోవడానికి సరిపడినంత నిద్ర ఒక ఔషధమని వైద్యవర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా 60 ఏళ్ల పైబడి వయసులో పిల్లలు తమను పట్టించుకోరన్న అభద్రతాభావం, ఆందోళన వెంటాడుతున్నాయి. పిల్లలు వారి భయాలు పోగొట్టి అభయాలు ఇవ్వడం ద్వారానే వృద్ధుల శేష జీవితం సాఫీగా సాగుతుంది.